బుధవారం
20-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 29
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## ప్రత్యేక హోదాపై మళ్లీ పాతపాటే

**ముగిసిన అధ్యాయమన్న కేంద్ర మంత్రి నిత్యానందరాయ్**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:**
ఏపీకి ప్రత్యేక హోదా కల్పించే అంశంపై కేంద్ర హోం శాఖ మళ్లీ పాతపాటే పాడింది. అది ముగిసిన అధ్యాయమంటూ లోక్‌సభలో కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ మరోసారి స్పష్టం చేశారు. టీడీపీ పార్లమెంటు సభ్యులు కింజారపు రామ్మోహన్ నాయుడు మంగళవారం లోకసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదాకు సంబంధించి 14వ ఆర్థిక సంఘం ప్రాధాన్యత ఇవ్వలేదు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా 42 శాతానికి పెంచామన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని హామీలు చాలావరకు అమలు చేశామని, మిగతా కొన్ని అంశాల అమలు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, విద్యా సంస్థల ఏర్పాటుకు చట్టంలో పదేళ్ల కాల వ్యవధిని నిర్దేశించారన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులతో ఎప్పటికప్పుడు చట్టంలోని వివిధ నిబంధనల అమలు పురోగతిని సమీక్షిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 28 సార్లు సమీక్షా సమావేశాలు జరిగాయని కేంద్ర మంత్రి వెల్లడించారు. 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాల మధ్య పన్నుల సమాంతర పంపిణీలో సాధారణ కేటగిరీ రాష్ట్రాలు, ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాల మధ్య ఎటువంటి వ్యత్యాసాన్ని చూపలేదన్నారు. ఎఫ్ఎఫ్‌సీ సిఫారసుల ప్రకారం, 2015-20 కాలానికి రాష్ట్రాలకు నికర భాగస్వామ్య పన్నుల వాటాను 32

- మిగతా 2 లో

## ఆ ఐదూళ్లపై మంత్రుల వాగ్యుద్ధం

- హైదరాబాద్ ఇచ్చేస్తారా?
- మళ్లీ ఉమ్మడి రాష్ట్రంగా ఉంచమంటే ఎలా ఉంటుంది? : బొత్స
- భద్రాద్రి రాముడు ముంపు నివారణకేనన్న పువ్వాడ అజయ్
- కొత్త వివాదాలు సృష్టించవద్దంటూ మంత్రి అంబటి హితవు
- కలకలం రేపిన రెండు రాష్ట్రాల మంత్రుల వ్యాఖ్యలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:**
ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలంకు ముంపు పొంచి ఉందని, అందువల్ల ఏపీ విలీన మండలాల్లో 5 గ్రామాలను తెలంగాణాకు కేటాయించాలని ఆ రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కోరగా, దానిపై మంత్రి బొత్స సత్యనారాయణ ఘాటుగా స్పందిస్తూ చేసిన వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల్లో కలకలం రేపాయి. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ కోల్పోవడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఆదాయం పడిపోయిందని, హైదరాబాద్ మాకు కావాలని అడిగితే ఇస్తారా? అని తెలంగాణా మంత్రి అజయ్‌ని ప్రశ్నించారు. తెలంగాణా విడిపోవడం వల్ల హైదరాబాద్ ద్వారా ఏపీకి రావాల్సిన ఆదాయం తగ్గిపోయిందని, గతంలో వలే మళ్లీ ఉమ్మడి రాష్ట్రంగానే ఉంచాలని

- మిగతా 2 లో

## మంచం పట్టిన గిరిజనం

**ఆసుపత్రుల కిటకిట**

**వైద్యులు, సిబ్బంది కొరత**

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:**
మన్యం జిల్లాల్లో గిరిజనం మంచం పట్టారు. మొన్నటి వరకు కరోనా మహమ్మారి గిరిజనులను భయాందోళనకు గురి చేస్తే, తాజాగా సీజనల్ జ్వరాలు దడ పుట్టిస్తున్నాయి. ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని వామపక్షాలు, గిరిజన, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. ఏటా సీజనల్ జ్వరాలకు వందలాది మంది గిరిజనులు బలైపోతున్నారు. సరైన వైద్య సౌకర్యాలు, రక్షిత మంచినీరు, రహదారులు లేక అనేకమంది మృత్యువాత పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు మరింత అధ్వానంగా మారాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఇంకా డోలిమోతలు తప్పడం లేదు. అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ

- మిగతా 2 లో

- రహదారి సౌకర్యాలు కరువు
- ఏజెన్సీలో డోలిమోతలే దిక్కు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

## ఉపరాష్ట్రపతి పదవికి ఆల్వా నామినేషన్

**పెద్దసంఖ్యలో విపక్ష నేతల హాజరు**

**న్యూఢిల్లీ:**
ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి మార్గరెట్ ఆల్వా మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆల్వాకు మద్దతిస్తున్న ప్రతిపక్ష పార్టీల నేతలు ఆమె వెంట ఉన్నారు. నామినేషన్ అనంతరం ఆల్వా మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలంటే తనకు భయం లేదని, గెలుపోటములు జీవితంలో ఓ భాగం మాత్రమేనని పేర్కొన్నారు. అయితే, పార్లమెంటు ఉభయసభల సభ్యులపై

- మిగతా 2 లో

## ధరల బాదుడేంటి?

- భగ్గుమన్న ప్రతిపక్షం
- పార్లమెంట్‌లో రెండవ రోజూ ఆందోళన
- ఉభయ సభలూ వాయిదా
- ప్రాంగణంలో కాంగ్రెస్ నిరసన

**న్యూఢిల్లీ :**
పార్లమెంట్ వర్షకాల సమావేశాలు వాడీవేడీగా సాగుతున్నాయి. మంగళవారం రెండవ రోజూ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, జీఎస్‌టీ, అగ్నిపథ్ పథకాలకు వ్యతిరేకంగా ఉభయ సభల్లోనూ ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేశాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్లమెంటు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేసింది. ధరల పెరుగుదల నుంచి అగ్నిపథ్ పథకం వరకు వివిధ అంశాలపై విపక్షాలు గందరగోళం సృష్టించడంతో రాజ్యసభ కార్యకలాపాలు మంగళవారం రోజంతా వాయిదా పడ్డాయి. ఉదయం కూడా విపక్షాలు అడ్డంకులు సృష్టించడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ భారీ విధ్వంస ఆయుధాలు, వాటి పంపిణీ వ్యవస్థల (చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నిషేధం) సవరణ బిల్లు, 2022ను ప్రవేశపెట్టాలని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను కోరారు. ఇంతలో విపక్ష సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించారు. గందరగోళం నడుమే మంత్రి బిల్లును ప్రవేశపెట్టారు. హరివంశ్ సభను నియంత్రణలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేసినా ప్రతిపక్షం లొంగలేదు. సాయుధ దళాల్లో నియామకం కోసం అగ్నిపథ్ పథకం, జీఎస్‌టీ పెంపు, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై చర్చించాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేతోపాటు అనేక మంది నేతలు నోటీసులు ఇచ్చినా అంగీకరించలేదు. అనంతరం సభను బుధవారం ఉదయానికి వాయిదా వేశారు. వర్షాకాల సమావేశాల్లో మొదటి రోజైన సోమవారం కూడా సభ ఇలాంటి అంతరాయాలను ఎదుర్కొంది.

**ఆహార ఉత్పత్తులపై జీఎస్‌టీ విధింపుపై లోక్‌సభలో గందరగోళం**

ఆహార ఉత్పత్తులపై జీఎస్‌టీ విధించడం, ధరల పెరుగుదల అంశంపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య లోక్‌సభ కార్యకలాపాలు మంగళవారం వాయిదా పడ్డాయి. మధ్యాహ్నం 2 గంటలకు సభ

- మిగతా 2 లో

## నేడే శ్రీలంక అధ్యక్ష ఎన్నిక

**ఈ పీఠానికి త్రిముఖ పోరు**

2లో

**ఇదీ లోకం!**

## సీపీఐ జాతీయ మహాసభల ప్రచారానికి శ్రీకారం

- ఇబ్రహీంపట్నంలో గోడలపై నినాదాలు రాసిన సీహెచ్ కోటేశ్వరరావు
- అభినందించిన జల్లి విల్సన్, అక్కినేని వనజ

విజయవాడలో అక్టోబర్ 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారానికి ఎన్టీఆర్ జిల్లాలో శ్రీకారం చుట్టారు.

2లో

## జగన్ సర్కార్‌కు మరో షాక్ !

- ఐఆర్ఎస్ కృష్ణకిషోర్‌పై దురుద్దేశంతోనే కేసులు
- అక్రమ కేసులంటూ కొట్టేసిన హైకోర్టు



**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:**
జగన్ ప్రభుత్వానికి మరో షాక్ తగిలింది. ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణకిషోర్‌పై మంగళగిరి సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు మంగళవారం కొట్టి వేసింది. కృష్ణ కిషోర్‌పై సీఐడీ పెట్టిన కేసు అక్రమమేనని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఈడీబీ సీఇవోగా కృష్ణ కిషోర్ ఎక్కడా అక్రమాలకు పాల్పడలేదని పేర్కొంది. ఈడీబీ సీఇవోగా ఉన్నప్పుడు అవకతవకలకు పాల్పడ్డారంటూ కృష్ణ కిషోర్‌పై గతంలో వివిధ సెక్షన్ల కింద మంగళగిరి సీఐడీ పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన అధికారులపై కక్షసాధింపు చర్యలకు దిగిందన్న ఆరోపణలున్నాయి. దీనిలో భాగంగా జాస్తి కృష్ణ కిషోర్‌ను వివిధ కారణాలు చూపి సస్పెండ్ చేయడమే కాకుండా ఆయనపై క్రిమినల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. పరిశ్రమలు, మౌలిక వసతుల శాఖ నుంచి నివేదిక తెప్పించుకుని కేసు నమోదు చేసినట్టు అప్పట్లో వైసీపీ ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ఆరు నెలల్లోగా విచారణ పూర్తి చేయాలని సీఐడీని ఆదేశించిన ప్రభుత్వం...విచారణ పూర్తయ్యే వరకు అమరావతి విడిచి వెళ్లకూడదని కృష్ణ కిశోర్‌కు అప్పట్లో ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ఆయనపై సెక్షన్ 188, 403, 409, 120 బీ కింద సీఐడీ కేసులు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో తన సస్పెన్షన్‌పై కృష్ణ కిషోర్ క్యాట్‌ను ఆశ్రయించగా,

- మిగతా 2 లో

## వ్యవసాయ వారసత్వాన్ని కాపాడుకుందాం: చైనా

**బీజింగ్ :** వ్యవసాయ వారసత్వాన్ని కాపాడుకోవడం, వ్యవసాయ నాగరికతను సృష్టించిన మానవాళి ఉమ్మడి బాధ్యతగా జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వ్యవసాయ సాగుకు సంబంధించి వారసత్వ పద్ధతులపై జరుగుతున్న ప్రపంచ సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అభినందన లేఖ పంపారు. ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (యుఎన్) ప్రారంభించిన వ్యవసాయ వారసత్వ వ్యవస్థల కార్యక్రమానికి చైనా స్పందించింది. చైనా వ్యవసాయ వారసత్వాన్ని సంరక్షిస్తోందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. వ్యవసాయ వారసత్వ వ్యవస్థల పరిరక్షణను బలోపేతానికి, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ, శాస్త్రీయ, సాంకేతిక విలువల మెరుగుదలకు, స్థిరమైన అభివృద్ధి కోసం యుఎన్ 2030 ఎజెండాను అమలు చేయడంలో సహాయానికి, నిర్మాణానికి చైనా అంతర్జాతీయ సమాజంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. మానవజాతి కోసం భాగస్వామ్య భవిష్యత్తుతో కూడిన సంఘం యుఎస్‌గా పేర్కొన్నారు.

# నేడే శ్రీలంక అధ్యక్ష ఎన్నిక

### ఈ పీఠానికి త్రిముఖ పోరు

### 44ఏళ్లలో తొలిసారిగా పార్లమెంటులో ప్రత్యక్ష ఎన్నిక

### అలాహాప్పెరుమాకు మద్దతుగా పోటీ నుంచి తప్పకున్న ప్రేమదాసా

**కొలంబో:** శ్రీలంక అధ్యక్షుడిని ఆ దేశ పార్లమెంటు 44 ఏళ్లలో తొలిసారిగా ప్రత్యక్షంగా బుధవారం ఎన్నుకోబోతోంది. చివరి నిమిషంలో రాజకీయ మార్పుల క్రమంలో ఆపద్ధర్మ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘెకు విపక్షాలు మద్దతిచ్చిన పాలక పక్షం రెబల్ నేత దల్లాస్ అలాహాప్పెరుమాకు మధ్య హోరాహోరీగా పోరు జరగనుంది. వాస్తవానికి అధ్యక్ష పీఠానికి త్రిముఖ పోరు నెలకొంది. పోటీలో వామపక్ష నేత, జనతా విముక్తి పెరామునా పార్టీకి చెందిన అనురా కుమార దిస్సానాయకె ఉన్నారు. ఆయన పేరును చట్టసభ్యులు మంగళవారం ప్రతిపాదించారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో అలాహాప్పెరుమాకు మద్దతుగా తన అభ్యర్థిత్వాన్ని ప్రతిపక్ష నేత సాజిత్ ప్రేమదాసా మంగళవారం ఉపసంహరించుకున్నారు. 20వ తేదీన అంటే బుధవారం అధ్యక్ష ఎన్నిక జరుగుతుంది. 73ఏళ్ల విక్రమసింఘె ముందంజలో ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేసినప్పటికి పోటీ అంత సులువు కాదన్న సంకేతాలు ఉన్నాయి. అధికార ఎస్ఎల్‌పీపీ మద్దతు లేకుండా విక్రమసింఘె రాణించడం కష్టమన్న భావన ఉంది. 225 మంది సభ్యుల సభలో మ్యాజిక్ ఫిగర్ 113 దాటాలంటే విక్రమసింఘెకు 16 అదనపు ఓట్లు అవసరం. ఆయన 12కుగాను కనీసం తొమ్మిది తమిళపార్టీ ఓట్ల తనకు వస్తాయని నమ్మకం పెట్టుకున్నారు. ప్రధాన ప్రతిపక్షం సమాగి జనా బలావేగయా (ఎస్‌జేబీ) ఫిరాయింపు నేతల ఓట్లను ఆశిస్తున్నారు. వారిలో అనేక మందిని ఈయనే రాజకీయాల్లోకి తెచ్చారు.

ఎస్‌జేబీకి వాస్తవంగా 54 మంది సభ్యులు ఉండగా ఇటీవల సంఖ్య 48కు తగ్గింది. ఇద్దరు తిరిగిరాగా సంఖ్య 50కు చేరింది. ఎస్‌జేబీ సభ్యులు 50 మందికి తోడు అలాహాప్పెరుమాకు సొంతంగా ఉన్న 10 మంది, ఎస్ఎల్‌పీపీ నుంచి 28 మంది కలిపి మొత్తం సంఖ్య 90కు చేరగా ఎస్ఎల్‌పీపీ నుంచి మరో 25 ఓట్లు అవసరం ఉంటుంది. ఎస్ఎల్‌పీపీ ఎంపీల్లో వ్యక్తిగత అభద్రతా భావం విక్రమసింఘెకు కలిసిరావచ్చు అన్న అంచనా ఉంది.

**అసాధారణ ఎన్నిక**

సభాపతి ఓటింగ్‌లో పాల్గోబోతున్నందున బుధవారం జరగబోయే ఎన్నిక అసాధారణమైంది. శ్రీలంక చరిత్రలో అంటే 1978 నుంచి అధ్యక్షుడిని ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నది లేదు. 1982, 1988, 1994,1999, 2005,2010, 2015, 2019లోనూ పాపులర్ ఓటు అధారంగానే అధ్యక్షుడి ఎన్నిక జరిగింది. 1993లో అధ్యక్షులు రణసింఘె ప్రేమదాస హత్యకు గురి అయినప్పుడు మాత్రమే అధ్యక్ష పీఠం ఆకస్మికంగా ఖాళీ అయింది. ఆ తర్వాత డీబీ విజేతుంగాను పార్లమెంటు ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఆయన ప్రేమదాసా పదవీకాలం వరకు అధ్యక్షుడి కొనసాగారు. ఇప్పుడు ఎన్నికయ్యే నూతన అధ్యక్షుడు కూడా 2024 నవంబరు అంటే రాజపక్సే పదవీకాలం ముగిసేంత వరకు ఆ పదవిలో ఉంటారు.

**పహారా నీడన పార్లమెంటు:** శ్రీలంక పార్లమెంటు పహారా నీడన ఉంది. అధ్యక్షుడి ఎన్నిక క్రమంలో భవనం చుట్టూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సభ్యులను సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరించడంపై సమగ్ర దర్యాప్తును కోరుతూ ఐజీపీకి స్పీకర్ ఫిర్యాదు చేశారు. అధ్యక్ష ఎన్నికకు నామినేషన్లను పార్లమెంటుకు స్వీకరించేందుకు కొన్ని గంటల ముందు స్పీకర్ మహీందా యపా అబేవర్ధనే ఈ ఫిర్యాదు చేశారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టడం, హెచ్చరికలు, బెదిరింపులకు పాల్పడటం ఆక్షేపణీయమని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పబోవంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

## సీపీఐ జాతీయ మహాసభల ప్రచారానికి శ్రీకారం

**విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం :** విజయవాడలో అక్టోబర్ 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారానికి ఎన్టీఆర్ జిల్లాలో శ్రీకారం చుట్టారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు స్వయంగా బ్రష్ చేతబట్టి ఇబ్రహీంపట్నం-భద్రాచలం జాతీయ రహదారి వెంబడి గోడలపై నినాదాలు రాసి ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆయనతోపాటు మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సీహెచ్ దుర్గాకోటేశ్వరరావు, సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేశ్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు కలిసి నినాదాలు, కమ్యూనిస్టు పార్టీ గుర్తుకు రంగులు వేసి అతి పెద్ద వాల్ రైటింగ్‌ను పూర్తి చేశారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా జాతీయ మహాసభల ప్రచారం కోసం ఇబ్రహీంపట్నంలో వాల్ రైటింగ్స్ ప్రారంభించిన విషయాన్ని తెలుసుకుని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకుడు అక్కినేని చంద్రరావు తదితరులు వచ్చి వాల్ రైటింగ్స్‌ను పరిశీలించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ, ఏఐటీయూసీ స్థానిక నాయకులు జి.రాము, టి.నరసింహారావు, మధుసూదనరావు, టి.సుబ్బారావు, కృష్ణ, మాణిక్యాలరావు, శివరాం, సురేంద్ర తదితరులు సహకారం అందించారు.

## ధరల బాదుడేంటి?

(మొదటిపేజీ తరువాయి)

తిరిగి సమావేశమైన వెంటనే కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే తదితర విపక్ష సభ్యులు ధరల పెరుగుదల, ఆహార ఉత్పత్తులపై జీఎస్‌టీ విధించడాన్ని నిరసిస్తూ ప్లకార్డులు పట్టుకుని సభ వెల్‌లోకి వచ్చారు. సభ్యులు పత్రాలు విసిరేసిన తర్వాత, అధ్యక్ష స్థానంలో ఉన్న కిరీట్ ప్రేమ్‌జీభాయ్ సోలంకి సభను బుధవారానికి వాయిదా వేశారు. అంతకుముందు ఇదే అంశంపై స్పీకర్ ఓం బిర్లా సభను ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు. ధరల పెరుగుదలపై విపక్ష సభ్యులు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక ప్లకార్డులో 'గబ్బర్ సింగ్ మళ్లీ దాడి' అని రాసి ఉంది. విపక్ష సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లాలని బిర్లా విజ్ఞప్తి చేస్తూ, సభలో ప్లకార్డులు పట్టుకోవడం పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. సభలో రైతుల సమస్యలపై చర్చ జరుగుతున్నందున సభ్యులు అందులో పాల్గొనాలని ఆయన కోరారు. 'మీరు నిబంధనల పుస్తకాన్ని తీసుకువెళతారు. కానీ నిబంధనలు అనుసరించరు. నిబంధనల ప్రకారం ఇక్కడ ప్లకార్డులు తీసుకురావడం నిషేధం. కానీ మీరు వాటిని తీసుకువస్తున్నారు. మీరు రైతుల సమస్యను సభ బయట లేవనెత్తారు కానీ లోపల కాదు. మీరు ధరల పెరుగుదల సమస్యను సభ వెలుపల లేవనెత్తారు కానీ లోపల కాదు. గత సమావేశాల్లో మీరు ధరల పెరుగుదలపై చర్చలో పాల్గొనలేదు. ఇది మంచిది కాదు' అని స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేయడానికి ముందు అన్నారు. పార్లమెంట్ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్‌కు చెందిన అనేక మంది నేతలు నిరసనలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, అధీర్ రంజన్ చౌదరి, మల్లికార్జున్ ఖర్గే సహా అనేక మంది నాయకులు చేతిలో బ్యానర్లతో గాంధీ విగ్రహం దగ్గర గుమిగూడారు.

## ఉపరాష్ట్రపతి పదవికి ఆల్వా నామినేషన్

(మొదటిపేజీ తరువాయి)

తనకు విశ్వాసం ఉందని, వారంతా తనకు అండగా ఉంటారని భావిస్తున్నట్లు ఆల్వా తెలిపారు. పటిష్టవంతమైన, ఐక్య భారత్ నిర్మాణానికి అంతా కలిసి వస్తారని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పదవీకాలం ఆగస్టు 10న పూర్తవుతున్నందున ఆగస్టు 6వ తేదీన కొత్త ఉపరాష్ట్రపతి కోసం ఎన్నిక జరుగుతుంది. ఎన్‌డీఏ అభ్యర్థి జగ్‌దీప్ ధన్కర్‌కు ఆల్వా గట్టి పోటీ ఇచ్చే అభ్యర్థిగా విపక్షాలు భావిస్తున్నాయి. ఆల్వా నామినేషన్‌కు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జునఖర్గె, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి, శివసేన నేత సంజయ్ రౌత్, ఎస్‌పీ నేత రామ్‌గోపాల్ యాదవ్, డీఎంకే నేత తిరుచి శివ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఎండీఎంకే నేత వైకో తదితరులు హాజరయ్యారు. తృణమూల్ కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీపార్టీ ప్రతినిధులెవరూ హాజరుకాలేదు. ఆల్వాను విపక్షాల అభ్యర్థిగా నిర్ణయించడానికి జరిగిన సమావేశానికి సైతం తృణమూల్, ఆప్ ప్రతినిధులు హాజరు కాలేదు. కానీ తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో తాను మాట్లాడినట్లు పవార్ చెప్పారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి నామినేషన్‌కు మంగళవారమే చివరి రోజు. రాజకీయాల్లో తాను చిత్తశుద్ధితో పనిచేశానని, ధైర్యంగా ఎదుర్కొన్నానని, ఎన్నికలంటే తనకు భయం లేదని ఆల్వా చెప్పారు. గెలుపు..ఓటములు జీవితంలో ఓ భాగమని వ్యాఖ్యానించారు. అయితే, పార్టీలకతీతంగా ఎంపీలంతా తనకు మద్దతిస్తారని ఆశిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## ప్రత్యేక హోదాపై మళ్లీ పాతపాటే

(మొదటిపేజీ తరువాయి)

శాతం నుంచి 42 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. అంతేగాక 2020-21, 2021-26 కాలానికి 15వ ఆర్థిక సంఘం కూడా 41 శాతం వద్ద అలాగే కొనసాగించిందని తెలిపారు. కాగా పన్నుల పంపిణీ ద్వారా ప్రతి రాష్ట్రానికి సంబంధించిన వనరుల అంతరాన్ని సాధ్యమైనంత వరకు భర్తీ చేయడమే దీని ఉద్దేశ్యమన్నారు. అలాగే, డెవల్యూషన్ మాత్రమే అంచనా వేసిన అంతరాన్ని పూడ్చలేని రాష్ట్రాలకు పోస్ట్ డెవల్యూషన్ రెవెన్యూ లోటు గ్రాంట్లు అందించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

## తగ్గిన కరోనా క్రియాశీల కేసులు

**న్యూఢిల్లీ :** దేశంలో కరోనా కొత్త కేసులు 15,528 నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 4,37,83,062కి చేరాయి. అయితే క్రియాశీల కేసులు 1,43,654కి తగ్గాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. మంగళవారం ఉదయం 8 గంటల వరకు అందిన వివరాల ప్రకారం, మరో 25 మందితో దేశంలో మొత్తం కరోనా మరణాలు 5,25,785కి పెరిగాయి.

మొత్తం ఇన్ఫెక్షన్లలో క్రియాశీల కేసులు 0.33 శాతంగా ఉన్నాయి. అయితే జాతీయ కోవిడ్ రికవరీ రేటు 98.47 శాతంగా ఉన్నట్లు మంత్రిత్వ శాఖ వివరించింది. గత 24 గంటల్లో కోవిడ్ క్రియాశీల కేసులు 610 తగ్గాయి.

## రష్యా గ్యాస్ ఆగిపోతే ఈయూ గోల్‌మాల్ : ఐఎమ్ఎఫ్

**ఐరాస:** రష్యా గ్యాస్ సరఫరాను నిలిపివేయడం అత్యంత హాని కలిగించే అంశమని, ఫలితంగా కొన్ని దేశాలు ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎమ్ఎఫ్) హెచ్చరించింది. హంగేరీ, స్లోవేకియా, చెక్ రిపబ్లిక్‌లలో జీడీపీ ఇప్పటికే 6 శాతం క్షీణించింది. ఇటలీ, జర్మనీ, ఆస్ట్రియా దేశాల జీడీపీ కూడా తీవ్రంగా దెబ్బతిందని ఎమ్ఎఫ్ తెలిపింది. జర్మనీలోని లుబ్మిన్‌లో నార్డ్‌స్ట్రీమ్ 1 పైపులు సాధారణ వార్షిక నిర్వహణ కోసం మూసివేయడమైంది, ఇది ఈ వారంతో ముగుస్తుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ వారంలో సాధారణ వార్షిక నిర్వహణ ముగిసే సమయానికి నోర్డ్ స్ట్రీమ్ 1 పైప్‌లైన్‌ను మూసివేస్తారనే ఊహాగానాల మధ్య గ్యాస్ కొరత, ఇంధన ధరల పెరుగుదల, దేశాభివృద్ధిపై ప్రభావాన్ని ఎదుర్కోవటానికి యూరప్‌లో సమగ్ర ప్రణాళిక లేదని ఐఎమ్ఎఫ్ తెలిపింది. ముఖ్యంగా హంగరీ, స్లోవేకియా, చెక్ రిపబ్లిక్‌లు సహా ఈ మూడు ఈయూ దేశాలు ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉంది. ఇటలీ, జర్మనీ, ఆస్ట్రియా కూడా గణనీయమైన ప్రభావాలను ఎదుర్కొంటాయని ఐఎమ్ఎఫ్ పేర్కొంది. మధ్య, తూర్పు ఐరోపాలోని అత్యంత ప్రభావితమైన కొన్ని దేశాలలో, గ్యాస్ వినియోగంలో 40శాతం కొరత ఏర్పడింది.

ఫలితంగా స్థూల దేశీయోత్పత్తి 6శాతం వరకు తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అయితే ప్రత్యామ్నాయ సరఫరాలు, ఇంధన వనరుల భద్రత, మౌలిక సదుపాయాల అడ్డంకులను తగ్గించడం ద్వారా ఆయా దేశాలలో గ్యాస్ పంపకానికి సంఘీభావ ఒప్పందాలను విస్తరించాలని ఫలితంగా ప్రతికూల ప్రభావాలను తగ్గించవచ్చునని పేర్కొంది. గత ఏడాది జూన్ నుండి రష్యా గ్యాస్ సరఫరాలో 60శాతం తగ్గుదలతో యూరప్‌లో ఇంధన మౌలిక సదుపాయాలు, ప్రపంచ సరఫరాలో ఆటంకాలు ఇప్పటివరకు కఠినంగా ఎదుర్కొన్నాయని ఐఎమ్ఎఫ్ పేర్కొంది.

## మంచం పట్టిన గిరిజనం

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో ఉన్న పాడేరు, అరకు, అనంతగిరి, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, ముంచింగిపుట్టు, పెదబయలు, డుంబ్రిగూడ, జి.మాడుగుల, హుక్కుం పేట మండలాల్లో, రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్న రంపచోడవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల, ఏజెన్సీ గంగవరం, దేవీపట్నం, మారేడుపల్లి, కూనవరం, చింతూరు, వీఆర్ పురం, ఎట పాక, అన్నవరం మండలాల్లో, మన్యం పార్వతిపురం జిల్లాలో ఉన్న పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గల మండ లాలు పాచిపెంట, మక్కువ, పార్వతీపురం, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మ వలస, సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల సీతంపేట, భామిని, వీరఘట్టం, మందస, మెలియా పుట్టి మండలాల పరిధిలో ఉన్న వందలాది గిరిజన గ్రామాల్లో వైద్య సదుపాయాలు అందక గిరిపుత్రులు అల్లాడుతున్నారు. పాడేరు ఏజెన్సీలో 6.30 లక్షల మంది గిరిజనులు నివసిస్తున్నారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో గల పోలవరం పది ముంపు మండలాల్లో గోదావరి వరద పోటు పెరిగింది. దీంతో గిరిజన గ్రామాల్లో జ్వరాల సంఖ్య అధికమైంది. పాడేరు ఐటీడీఏ పరిధిలో అరకు, అనంతగిరి, జీకేవీధి, ముంచింగిపుట్టు, కొయ్యూరు, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, పాడేరు, హుకుం పేట మండలాల్లో మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు విజృంభి స్తున్నాయి. అల్లూరి జిల్లా ఏజెన్సీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 40 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. 36 ఆంబులెన్స్‌లు కావాల్సి ఉన్నప్పటికీ 30 మాత్రమే అందు బాటులో ఉన్నాయి. ఇవి కూడా అప్పుడప్పుడు మరమ్మతు లకు గురికావడంతో గిరిజన ప్రాంతంలో వైద్యసేవలు అందించడం కష్టతరంగా మారింది. గిరిజన గ్రామాల్లో దోమల నివారణకు మలాథియాన్ వంటి స్ప్రేలు విస్తృతంగా చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణీలకు, చిన్నపిల్లలకు వైద్యులు లేకపోవడంతో అనేక మంది మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రిగా ఉన్న కేజీహెచ్‌కి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. పాడేరు, అరకు, నర్సీపట్నం, చింతపల్లి ఏరియా ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలా డుతున్నాయి. కొత్తగా ఏర్పాటుచేసిన సుంకరమెట్ట, కీలగాఢ, సీలేరు, ఆర్వీ నగర్ ఆసుపత్రిల్లో వైద్యులు తప్ప సిబ్బంది లేరు. మద్దిగురువు, పెదకోడపల్లి, మజ్జివలస, బొక్కులు, బుసపుట్టు, లోతేరు, గుంటసీమ ప్రాంతాల్లో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో గిరిజనులకు వైద్యసేవలు అందించడం కష్టతరంగా మారింది. రావికమతం, వి.మాడుగుల సరిహద్దు కొండ శిఖరంపై ఉన్న ఆదివాసీ గిరిజన గ్రామం జ్వరాలతో వణుకుతోంది. అరకువెలి మారుమూల పీటీజీ గ్రామమైన లంతమపాడులో ఐదుగురు టీబీ జబ్బుతో బాధపడుతున్నారు. అనేకమంది టీబీ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నారు. పాడేరు, చింతపల్లి ప్రభుత్వాసుపత్రిలు జ్వరాలతో కిటకిట లాడుతున్నాయి. ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయతీ మాలగుమ్మి, ఏనుగురై పంచాయతీ జంగంసరియా, పర్తపుట్, రాళ్లపుట్ గ్రామాల్లో ఒకే కుటుంబంలో ఐదుగురు చిన్నారులు జ్వరాల బారినపడ్డారు. అడవిలో ఎటు చూసినా జ్వరాల మాటే వినిపిస్తుంది. రక్తహీనత, పౌష్టికాహార లోపం కారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువ కావడంతో డెంగీ, మలేరియా జ్వరాలతో గిరిజనం బలైపోతున్నారు. ప్రభుత్వం వెంటనే ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, విస్తృతంగా వైద్యశిబిరాలు నిర్వహించాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

### ఎగువ నుంచి చేరుతున్న 3,17,519 క్యూసెక్కుల నీరు

**విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు :** కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 3,17,519 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. జూరాల స్పిల్‌వే నుంచి 1,29,781 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,52,153 క్యూసెక్కులు, జూరాల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా 35,152 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి తెలంగాణా విద్యుత్ ఉత్పత్తికి 19,071 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 153.843 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 885 అడుగుల కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 872.90 అడుగుల నీరు ఉంది. ఇదే స్థాయిలో ఇన్‌ఫ్లో కొనసాగితే మరో రెండు రోజుల్లో శ్రీశైలం స్పిల్‌వే గేట్లు ఎత్తి దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేసే అవకాశం ఉంది.

## జగన్ సర్కార్‌కు మరో షాక్ !

(మొదటిపేజీ తరువాయి)

సదరు ఉత్తర్వులపై కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ స్టే విధించింది. ఆపై కృష్ణ కిషోర్‌పై సస్పెన్షన్ చెల్లదని జస్టిస్ నరసింహారెడ్డి అధ్యక్షతన విచారించిన క్యాట్ హైదరాబాద్ బెంచ్ తుది తీర్పును వెల్లడించింది. అనంతరం ఐఆర్‌ఎస్ అధికారిపై నమోదైన కేసుకు సంబంధించి ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఆ కేసులో పెట్టిన సెక్షన్‌లు చెల్లవని కేసును హైకోర్టు తేల్చింది. కృష్ణ కిషోర్ వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకున్నట్లు గానీ, లాభ పడినట్లు గాని ఎక్కడా ఆధారాలు లేవని తేల్చి చెప్పింది. సీఎం జగన్‌పై కేసులను దర్యాప్తు చేసిన నాటి సీబీఐ అధికారి లక్ష్మీనారాయణతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే కారణంగా, దురుద్దేశపూర్వకంగా ఐఆర్‌ఎస్ అధికారిపై కేసు పెట్టినట్లు ధర్మాసనం నిర్ధారించింది. భజన్ లాల్ కేసులో సుప్రీం కోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కేసు కొట్టి వేయదగినదిగా పేర్కొంది.

గతంలో కృష్ణ కిషోర్ హైదరాబాద్ ఆదాయపు పన్ను శాఖ సర్కిల్‌లో పని చేసిన సమయంలో జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్‌పై వస్తున్న ఆదాయానికి పన్నులు కట్టాలని నోటీసులు జారీ చేశారు. దాన్ని మనసులో పెట్టుకుని కక్షసాధింపుగా సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత తనను సస్పెండ్ చేసి తప్పుడు కేసు బనాయించినట్లు కృష్ణ కిషోర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ జరిపిన న్యాయస్థానం కేసులపై ఆధారాలు సమర్పించడంలో సీఐడీ విఫలమైందని పేర్కొంటూ ఆ కేసులన్నింటినీ కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## అగ్నిపథ్ కేసులన్నీ దిల్లీ హైకోర్టుకు బదిలీ

**న్యూదిల్లీ :** త్రివిధ దళాల్లో నియామకాల కోసం కేంద్రం తీసుకు వచ్చిన అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా నమోదైన పిటిషన్లు అన్నింటిని దిల్లీ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశాలిచ్చింది. ఈ వ్యవహారంలో తమ వద్ద పెండింగ్ కేసులతో పాటు ఇతర రాష్ట్రాల కోర్టులో ఉన్న సంబంధిత పిటిషన్లు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాల(పిల్)ను దిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ ఏఎస్ బొప్పన్న ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు ఆదేశాలను కేరళ, పంజాబ్, హరియాణా, పాట్నా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల హైకోర్టులకూ జారీచేసింది. అగ్నిపథ్ కేసులను దిల్లీ హైకోర్టుకు బదిలీ చేయండి లేదంటే పిటిషన్ల అనుమతితో వాటిని దిల్లీ హైకోర్టు తీర్పు వెలువరించేంత పెండింగ్‌లో ఉంచండి అని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. ఆయా హైకోర్టుల పిటిషనర్లు కావాలనుకుంటే దిల్లీ హైకోర్టును ఆశ్రయించవచ్చునని పేర్కొంది. ఈ కేసులను దిల్లీ హైకోర్టు విచారించడమే సరైనదిగా భావించి వాటిని బదిలీ చేస్తున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

## ఆ ఐదూళ్లపై మంత్రుల వాగ్యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అడిగితే బావుంటుందా? అలా అయితే చేసేయమనండి. మాకేం అభ్యంతరం లేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు డిజైన్ల ప్రకారమే నిర్మాణం జరుగుతుంది. సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా మేము ఏమీ చేయలేదు కదా? మాట్లాడే వ్యక్తులు బాధ్యతగా మాట్లాడాలి. సూచనలు సమస్యను పరిష్కరించుకునేలా ఉండాలే తప్ప రెచ్చగొట్టేలా వ్యవహరించకూడదు. పువ్వాడ అజయ్‌కుమార్ అతని జిల్లాలో ముంపు ప్రాంతాల సంగతి చూసుకుంటే సరిపోతుంది. ముంపు మండలాల ప్రజలు ఏపీ కుటుంబ సభ్యులు. ఆ ప్రజల బాధ్యత పూర్తిగా మాదే. విలీన మండలాలను తెలంగాణాలో కలిపేయాలంటే రాష్ట్రాన్ని మళ్లీ కలపాలని మేం కూడా డిమాండ్ చేస్తామని వ్యాఖ్యానించారు. జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కూడా తెలంగాణా మంత్రి వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఎలాంటి గొడవల్లేవని, కొత్తగా సృష్టించేందుకు ప్రయత్నించవద్దని పువ్వాడ అజయ్‌కు హితవు చెప్పారు. హైదరాబాద్ లేక్‌వ్యూ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాచలంలో వరదలు వస్తే పోలవరం ఎలా కారణమవుతుందని ప్రశ్నించారు. పోలవరం ఎత్తు విషయంలో సీడబ్ల్యూసీ అనుమతి మేరకే నిర్ణయం జరిగింది. అయినా భద్రాచలంలో కొత్తగా వరద రాలేదు. 1986లో 75 అడుగుల వరకు వచ్చాయి. ఇవన్నీ తెలుసుకోకుండా మీరు 5 గ్రామాలు అడుగుతున్నారు. మేం భద్రాచలం అడిగితే ఇస్తారా అని ప్రశ్నించారు. ఏపీ మంత్రుల వ్యాఖ్యలపై తర్వాత తెలంగాణా మంత్రి పువ్వాడ అజయ్ స్పందిస్తూ తన మాటలు తప్పుపట్టడం బాధాకరమన్నారు. భద్రాచలం రాముడు ముంపునకు గురికాకుండా 5 ఊళ్లు కావాలని అడిగితే హైదరాబాద్‌ను ఇస్తారా? అని బొత్స మాట్లాడడం అసందర్భం, అర్థరహితమన్నారు. రాముడు మునిగిపోతుంటే ఆంధ్రా ప్రజలకు కూడా బాధ కలుగుతుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రతినిధులు పని చేయాలన్నారు. సీఎం కేసీఆర్‌తో సీఎం జగన్ చర్చలకు వచ్చేలా మంత్రులు బొత్స, అంబటి కృషి చేయాలని, సున్నితమైన ఈ విషయాన్ని వివాదాస్పదం చేయవద్దంటూ హితవు చెప్పారు. రెండు రాష్ట్రాల ప్రజల కోసం మాట్లాడిన తన వ్యాఖ్యలను వక్రీకరించి విమర్శించడం తగదన్నారు. అపార్థాలకు తావు లేకుండా వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కలిసి పని చేద్దామని పువ్వాడ కోరారు. ఇలా మొత్తానికి రెండు రాష్ట్రాల మంత్రులు చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో కలకలం రేపాయి.

## సీఈపీఐ ఆధీనంలో 12,611 ఆస్తులు : కేంద్రం

**న్యూఢిల్లీ :** పాకిస్తాన్, చైనాల దేశాల పౌరసత్వం తీసుకుని వెళ్లి పోయిన వారికి సంబంధించిన 12,611 స్థిర, చర ఆస్తులను గుర్తించినట్లు కేంద్రం తెలిపింది. వీటిని ప్రభుత్వ పరిభాషలో ఎనిమీ ప్రాపర్టీస్ అంటున్నట్లు పేర్కొంది. మంగవారం లోక్‌సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిషా ఈ మేరకు వివరాలను వెల్లడించారు. దేశంలో గుర్తించిన మొత్తం ఆస్తుల్లో పాకిస్తాన్‌కు చెందిన వారివి 12,485, చైనాకు చెందిన వారివి 126 ఆస్తులు ఉన్నట్టు పేర్కొన్నారు. 1962లో బాంగ్లాదేశ్ విభజన నేపథ్యంలో జరిగిన యుద్ధంలో దేశం విడిచివెళ్లి చైనా, పాక్ దేశాల పౌరసత్వం పొందిన వారి ఆస్తులను శత్రువు ఆస్తులుగా పరిగణిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎనిమీ ప్రాపర్టీ యాక్ట్ -1968 ప్రకారం వీటిని కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ ఫర్ ఇండియా (సీఈపీఐ)కి అప్పగించినట్టు చెప్పారు.

## సినీ దర్శకుడు మణిరత్నంకు అస్వస్థత

**చెన్నై :** ప్రముఖ సినీ దర్శకుడు మణిరత్నం మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన జ్వరం రావడంతో చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరినట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై ఆసుపత్రివర్గాలు స్పందించలేదు. జ్వరంతో బాధపడుతున్న ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారని, కరోనా నెగిటివ్ రిపోర్టు రావడంతో మంగళవారమే డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

## కేరళ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే శబరినాధన్ అరెస్టు

**తిరువనంతపురం :** కేరళ సీఎం పినరయి విజయన్‌కు వ్యతిరేకంగా గత నెల యూత్ కాంగ్రెస్ నేతలు తిరువనంతపురం విమానాశ్రయంలో చేపట్టినప నిరసనల కేసులో నిందితుడైన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కేఎస్ శబరినాధన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూడా అయిన ఆయనుకు సోమవారం నోటీసులు ఇచ్చిన పోలీసులు మంగళవారం నగరంలోని వలియతుర పోలీసు స్టేషన్‌కు విచారణ నిమిత్తం పిలిచి ఉదయం 10.50 కి అరెస్టు చేసినట్టు తెలిపారు. సీఎం ప్రయాణించిన విమానంలోనే ప్రయాణించిన యూత్ కాంగ్రెస్ సభ్యులతో శబరినాధన్‌ను టచ్‌లోనే ఉన్నారని, వారిని నిరసనకు ప్రోత్సహించారని పోలీసులు తెలిపారు.

## పౌరసత్వాన్ని త్యజించిన భారతీయులు

### మూడేళ్లలో 3.92లక్షల మంది

**న్యూఢిల్లీ :** భారత పౌరసత్వాన్ని వదిలి ఇతర దేశాల పౌరసత్వాన్ని స్వీకరించే వారి సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంది. గత మూడేళ్లల్లో 3.92 లక్షల మంది భారత పౌరసత్వాన్ని త్యజించినట్లు కేంద్రం తెలిపింది. వీరిలో అత్యధికంగా 1.70 లక్షల మంది అమెరికా పౌరసత్వాన్ని పొందినట్లు మంగళవారం లోక్‌సభకు కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. విదేశీ వ్యవహారాల శాఖ వివరాల మేరకు వ్యక్తిగత కారణాల వల్ల భారతీయ పౌరసత్వాన్ని వదులుకొన్న వ్యక్తులు 120 దేశాలలో ఉన్నారని, వారు ఆయా దేశాల పౌరసత్వాన్ని పొందారని మంత్రి పేర్కొన్నారు. 2019, 2020, 2021లో 3,92,643 మంది భారతీయులు పౌరసత్వాన్ని త్యజించినట్లు రాతపూర్వకంగా వెల్లడించలేదు. వీరిలో 1,70,795 మంది అమెరికా పౌరసత్వాన్ని పొందగా 64,071 మంది కెనడా; 58,391 మంది ఆస్ట్రేలియా; 35,435 మంది బ్రిటన్, 12,131 మంది ఇటలీ, 8,882 మంది న్యూజిలాండ్, 7,046 మంది సింగపూర్, 6,690 మంది జర్మనీ, 3,754 మంది స్వీడెన్, 48మంది పాకిస్థాన్ పౌరసత్వాన్ని పొందినట్లు మంత్రి పేర్కొన్నారు. 2019లో 1,44,017 మంది భారత పౌరసత్వాన్ని వదులుకోగా.. కోవిడ్ ప్రభావం క్రమంలో 2020లోనూ 85,256 మంది; 2021లో 1,63,370 పౌరసత్వాన్ని వదులుకున్నారని మంత్రి రాయ్ తెలిపారు.

# అధికారమంటే అజమాయిషీ కాదు

- ప్రజలపై మమకారం..ప్రజలందరి సంక్షేమం
- కొత్త లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేసిన సీఎం జగన్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** అధికారం అంటే అజమాయిషీ కాదని, ప్రజలపై మమకారం.. ప్రజలందరి సంక్షేమమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హులై ఉండి వివిధ కారణాల వల్ల ఈబీసీ నేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ మత్స్యకార భరోసా, రైతులకు ఇన్‌పుట్‌సబ్సిడీ, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ సున్నావడ్డీ పంటరుణాలు, వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ వాహన మిత్ర, వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాల కింద మొత్తం 3,39,096 మంది లబ్దిదారులకు రూ.137 కోట్ల నగదును మంగళవారం సీఎం జగన్ తన క్యాంపు కార్యాలయంలో బటన్‌నొక్కి వారి ఖాతాల్లో జమచేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ అర్హత ఉండి ఏ ఒక్కరూ ఏ ఒక్క పథకానికి దూరం కాకూడదని, అలాంటి పరిస్థితి రాకూడదని మన ప్రభుత్వం పడుతున్న తపన, తాపత్రయానికి ఈరోజు ఒక నిదర్శనమన్నారు. కేవలం బాధ్యతతో, పేదలపై ఉన్న మమకారంతో కులం, మతం, వర్గం, రాజకీయాలు చూడకుండా, చివరకు వాళ్లు మన పార్టీకి ఓటు వేయకపోయినా పట్టించుకోవడం లేదన్నారు. కేవలం అర్హత ఒక్కటే ప్రాతిపదికగా నవరత్నాల పాలన అందిస్తామని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. గత ప్రభుత్వానికీ, ఇప్పటికీ తేడా గమనించాలని కోరారు. గత ప్రభుత్వంలో పథకాలను పార్టీల వారీగా, కులాల వారీగా ఎలా కత్తిరించాలా? ఎలా ఎగ్గొట్టాలా? ఫలానా వారు తమకు వ్యతిరేకమని, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వలేదని? గ్రామాలలో ఇంతమందికే కోటా అని? ఇలా సాధ్యమైనంత ఎక్కువ మందికి రకరకాల కారణాలతో ఎగ్గొట్టే పరిస్థితి కనిపించేదని టీడీపీ ప్రభుత్వంపై జగన్ విమర్శలు గుప్పించారు. అందుకే దానికి పూర్తి భిన్నంగా వైసీపీ ప్రభుత్వం అవినీతి, వివక్ష, పక్షపాతానికి తావులే కుండా అర్హులందరికీ సంతృప్తస్థాయిలో సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పథకాలను పూర్తి పారదర్శకంగా అమలు చేయడానికి సామాజిక తనిఖీ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శిస్తున్నామన్నారు. బ్యాంకుల్లో వేసే డబ్బులను తిరిగి ఆ బ్యాంకులు జమచేసుకోలేని రీతిలో వేస్తున్నామన్నారు. ఏ నెలలో ఏ పథకం వస్తుందని ముందుగానే సంక్షేమ క్యాలెండర్లో చెప్పిన దాని ప్రకారం అమలు చేస్తున్నామని, దేశంలో ఎక్కడా ఇలా జరగడం లేదన్నారు. ఇలా మంచి చేయగలిగాం కాబట్టే.. మళ్లీ మీ గడప తొక్కగలుగుతున్నామని సీఎం వివరించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధిశాఖ) బూడి ముత్యాలనాయుడు, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, పౌరసరఫ రాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, సీఎస్ సమీర్ శర్మ, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, గృహనిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, హేండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ముఖ్యకార్యదర్శి కె.సునీత, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దళిత వర్గాలకు సామాజిక న్యాయం అందిస్తాం

**కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే**

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** దళిత వర్గాలకు సామాజిక న్యాయం అందించి సాధికారత సాధించేలా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కేంద్ర సామాజిక న్యాయ సాధికా రత మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా మీడియా ప్రతినిధులతో అథవాలే మాట్లాడుతూ రాష్ట్ర జనాభా 5కోట్లు కాగా అందులో 84.69 లక్షల మంది షెడ్యూల్ కులాలకు చెందిన వారు ఉన్నారన్నారు. అణగారిన వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో విద్యార్థినీ, విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం పోస్టు మెట్రిక్,ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. 2019 సంవత్సరంలో 2739 కేసులు, 2020లో 2432 కేసులు, 2021లో 2757 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటివరకు 1290 కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులలో ఇప్పటి వరకు నమోదైన దాదాపు 50 శాతం పైగా చార్జి షీట్లను నమోదు చేసినట్లు చెప్పారు. ఇతర వర్గాల వారు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారిని వివాహం చేసుకుంటే కులాంతర వివాహ పథకం ద్వారా అందించే నగదు ప్రోత్సాహకాన్ని 75 వేల నుంచి లక్ష 20 వేల రూపాయలకు పెంచినట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దళిత వర్గాలకు సముచిత స్థానం ఇవ్వాలనే సంకల్పంతో ఈ సారి ఎస్టీ వర్గానికి చెందిన మహిళను రాష్ట్రపతిని చేయనున్నారన్నారని పేర్కొన్నారు. కోనసీమ జిల్లాకు దళిత వర్గానికి చెందిన బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టడపై పట్ల సీఎం జగన్ ప్రత్యేక కృతజ్ఞతను తెలియజేస్తున్నట్లు కేంద్రమంత్రి రాందాస్ అథవాలే తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సాంఘికక సంక్షేమ శాఖ సెక్రటరీ యం.యం. నాయక్, డైరెక్టర్ హర్షవర్ధన్, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ రవిప్రకాష్‌రెడ్డి, ఏడి రఘురాం,బీసీ సంక్షేమ శాఖ ఆర్‌డి జి.వి రఘురామ్, సిఐడి ఎస్పీ వి రత్న, రిపబ్లిక్ పార్టీ నాయకులు బి.అనిల్, బ్రహ్మానందరెడ్డి, శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కల్తీ

**భయాందోళనలో గిరిజనులు**

**విశాలాంధ్ర-డుంబ్రిగూడ:** గిరిజన సహకార సంస్థ ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు కిలో రూపాయి బియ్యం పంపిణీలో ప్లాస్టిక్ బియ్యం కల్తీ జరుగుతున్నట్లు గిరిజనులు ఆరోపిస్తున్నారు. మండలంలో గత నెలలో డిపోల ద్వారా కార్డుదారులకు పంపిణీ చేశారు. అయితే బియ్యాన్ని పోలివున్న ప్లాస్టిక్ బియ్యం కల్తీ ఉండటాన్ని పలువురు గిరిజనులు గ్రహించారు. బియ్యాన్ని నీటిలో కడిగే ప్రయత్నం చేసినప్పుడు ప్లాస్టిక్ బియ్యం తడిబారి తెల్లటి పురుగుల నీటి పైకి తేలుతున్నాయని అన్నారు. దీంతో వారు భయాందోళన చెందుతున్నారు. పప్పు ఉప్పుల నూనె కల్తీ తో పాటు బియ్యం కూడా కల్తీ కావడంతో గిరిజనులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనేక మంది అవగాహన లేక ప్లాస్టిక్ కల్తీ బియ్యాన్ని వినియోగించిన గిరిజనులు, తాము ఎటువంటి అనారోగ్యం బారిన పడతామోనని భయాందోళన చెందుతున్నారు. కోటా బియ్యం పంపిణీలో ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇటువంటి కల్తీ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు పలువురు గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాణ్యమైన బియ్యాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు గిరిజనులు అంటున్నారు.

## అంబేద్కర్ పేరు కొనసాగించండి

**విదేశీ విద్యాపథకంపై సీఎం జగన్‌కు రామకృష్ణ లేఖ**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** విదేశీ విద్యా పథకానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును కొనసాగించాలని కోరుతూ సీఎం జగన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం లేఖ రాశారు. 'విదేశాల్లో విద్యనభ్యసించాలనే ఆసక్తి గల విద్యార్థులకు వరంగా నిలిచిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి స్కీమ్‌ను మీరు అధికారం చేపట్టిన తరువాత మూడేళ్లుగా పక్కన పెట్టారు. దీంతో విదేశాల్లో చదువుకోవాలనుకున్న విద్యార్థుల ఆశలు అడియాసలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విదేశీ విద్యా పథకానికి ఉన్న పేరును మార్పుచేసి..జగనన్న విదేశీ విద్యాదీవెనగా ఆదేశాలిచ్చింది. ఏపీలోని అన్ని సంక్షేమ పథకాలకు మీ పేరు (జగనన్న), వైఎస్ఆర్ పేర్లు మాత్రమే పెట్టారు. స్వాతంత్ర్య సమర యోధులు, ప్రజల కోసం సర్వస్వం త్యాగం చేసిన ఎందరో మహనీయులు, మహానుభావులుండగా ప్రభుత్వ పథకాలకు కేవలం మీ పేర్లు మాత్రమే పెట్టుకోవడం సరైందికాదు. పైగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును విదేశీ విద్యా పథకం నుండి తొలగించి, జగనన్న విదేశీ విద్యా దీవెనగా మార్చడం...ఆ మహనీయుడిని అవమానించడమే. అంబేద్కర్ పేరునే తొలగించారంటే మీ ప్రచార ఆర్భాటం పరాకాష్టకు చేరిందనేది అర్థమవుతోంది. ఇప్పటికైనా స్పందించి, విదేశీ విద్యాపథకాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుమీదనే కొనసాగించండి' అని రామకృష్ణ కోరారు.

## 22న మహాధర్నా

**విశాఖ ఉక్కు పోరాట కమిటీ**

**విశాలాంధ్ర-కూర్మన్నపాలెం:** మహా ధర్నాతో ఉక్కు యాజమాన్యానికి గుణపాఠం చెప్పాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపునిచ్చింది. మంగళవారం నాటి రిలే దీక్షలో సెంటర్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ ప్రతినిధులు గంధం వెంకట్రావు, వరసాల శ్రీనివాసరావు, డొక్కా నరసింహారావు, సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర, మురళి రాజు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన ఉక్కు పరిపాలనా భవనం ఎదుట ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 3:30 వరకు జరిగే మహా దీక్ష, ధర్నాను ఉద్యోగులంతా విజయవంతం చేయాలని కోరారు. విభాగాల వారీగా ప్రైవేటీకరణకు టెండర్లు పిలవడం, ప్రధాన విభాగాలలో ఉత్పత్తిని గణనీయంగా తగ్గించడం, తద్వారా నష్టాలు చూపించడంతో పాటు కార్మికులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు సాధన వేతన ఒప్పందం అమలు వంటి ప్రధాన అంశాలపై ఉక్కు యాజమాన్యం అవలంబిస్తున్న చర్యలు తిప్పి కొట్టడానికి కాంట్రాక్ట్ కార్మికులు, ఉక్కు ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. యాజమాన్యం ప్లాంటుపై ఎలాంటి అనుభవం లేని అధికారులను గుర్తించాలని కోరారు. త్యాగాలు, పోరాటాలు, బలిదానాల ద్వారా సిద్ధించిన విశాఖ ఉక్కు భవిష్యత్తుకు విఘాతం కలిగించే ఎలాంటి శక్తులనైనా ఎదుర్కొనే సత్తా ఈ ప్రాంత ప్రజానీకానికి, కార్మికవర్గానికి ఉన్నట్లు ఉక్కు యాజమాన్యం గమనించాలని హెచ్చరించారు. యువ కార్మికులు సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉన్నారో...అదేస్థాయిలో ప్రత్యక్ష కార్యాచరణలో పాల్గొనాలని కోరారు. మన ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచేవరకూ ప్రతి కార్మికుడు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కె.భాస్కర్‌రావు, కేవీ సత్యనారాయణ, డీవీకే రాజు తదితరులు పాల్గొన్నారు.

## బల్బ్ కొనలేని దుస్థితిలో పీహెచ్‌సీ!

- చీకట్లోనే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- నిధుల మంజూరుకు సాంకేతిక సమస్య
- చేతి చమురు వదిలించుకుంటున్న ఉద్యోగులు

**విశాలాంధ్ర - రావికమతం:** వైద్య రంగానికి అత్యధిక నిధులు కేటాస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు చెబుతున్నా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రం నిర్వహణ నిధులు లేక చీకట్లోనే మగ్గుతోంది. మూడు మండలాలకు కూడలిలో ఉన్న 24 గంటలు ప్రసూతి వైద్య కేంద్రమైన రావికమతం పీహెచ్‌సీకి ఆసుపత్రి అభివృద్ధి నిధులు విడుదల కాకపోవడంతో విద్యుత్ బల్బు కాలిపోయినా కొనేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక సిబ్బంది చీకట్లోనే విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. రావికమతం, బుచ్చయ్యపేట, మాడుగుల మండలాలకు ముఖ్య కూడలి అయిన ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులను ప్రభుత్వం కేటాయించింది. నాడు నేడు కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి జరిగింది. అయితే నిర్వహణ నిధులు సాంకేతిక కారణాలతో నిలిచిపోవడంతో అత్యవసర వస్తువులు సిబ్బందే సమకూర్చుకుంటున్నారు. మందులు జిల్లా కేంద్రం నుంచి ఇక్కడకు తేవడానికి, బాత్రూంలు, మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి అవసరమైన ఫినాయిల్, యాసిడ్, కంప్యూటర్ నిర్వహణ, మందుల చీటీలు తదితర అవసరాలకు ఆసుపత్రికి ఏటా రూ.2.50 లక్షలు ఆసుపత్రి అభివృద్ధి పేరిట ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. ఈ ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి టీవీఎస్ నాయుడు మార్చిలో బదిలీ కాగా సాంకేతికపరమైన ఇబ్బందులతో ఆసుపత్రికి మంజూరైన నిధులు మురిగిపోయాయి. ఆ తర్వాత వచ్చిన వైద్యాధికారి శ్రీనివాస్‌కు నిధులు వినియోగానికి సంబంధించి సాంకేతిక పరమైన అనుమతులలో జాప్యం కావడంతో ఇప్పటికి కూడా ఆసుపత్రి కనీస అవసరాలకు సిబ్బంది చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తుంది.

## గ్రంథాలయ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కల్కూరా, శారద

**విశాలాంధ్ర-విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ అధ్యక్షుడిగా కె.చంద్రశేఖర కల్కూరా(కర్నూలు), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రావి శారద(విజయవాడ) ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ సర్వసభ్య సమావేశం మంగళవారం నగరంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరై కోవిడ్ అనంతరం గ్రంథాలయ రంగ స్థితిగతులు, మారుతున్న కాలనికి అనుగుణంగా పౌర గ్రంథాలయాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. విద్యాసంస్థల సహకారంతో విద్యార్థులలో పఠనాశక్తిని పెంపొందించడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేయాల్సిన కృషిపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.చంద్రశేఖర కల్కూరా, ప్రధాన కార్యదర్శిగా రావి శారద, ఉపాధ్యక్షులుగా డాక్టర్ డి.పారినాయుడు (పార్వతీపురం), వి.కేశవరావు(కృష్ణా జిల్లా), ఆచార్య ఎం.దొరస్వామి (చిత్తూరు జిల్లా), ప్రాంతీయ సమన్వయకర్తలుగా డి.గోవిందరావు (శ్రీకాకుళం), ఎల్.వెంకటేశ్వరరావు (ఏలూరు), డాక్టర్ కె.నటరాజ నాయుడు(అనంతపురం), సంయుక్త కార్యదర్శులుగా ఎస్.గురుప్రసాద్ (విజయనగరం), డాక్టర్ టి.సాంబశివరావు (ఎన్టీఆర్ జిల్లా), ఆచార్య కె.సురేంద్రబాబు (తిరుపతి)తోపాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## అక్టోబర్‌కల్లా 2వేల గ్రామాల్లో సర్వే పూర్తి

**శాశ్వత భూహక్కు-భూరక్షపై మంత్రుల కమిటీ ఆదేశం**

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** రాష్ట్రంలో అక్టోబర్ నాటికి కనీసం రెండువేల గ్రామాల్లో సమగ్ర భూసర్వే పూర్తి అవ్వాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని మంత్రుల కమిటీ ఆదేశించింది. సచివాలయంలో మంగళవారం జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం ప్రగతిపై మంత్రుల కమిటీ సమీక్ష నిర్వహించింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రెవిన్యూ, విద్యాశాఖ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజేయ్ కల్లాం, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు సమగ్ర భూసర్వేకు సంబంధించిన వివరాలను మంత్రుల కమిటీకి వివరించారు. దీనిపై మంత్రులు స్పందిస్తూ ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం వల్ల భవిష్యత్తులో భూ వివాదాలకు ఆస్కారం ఉండదని, క్షేత్రస్థాయిలో భూ వివరాలు అత్యంత పారదర్శకంగా రికార్డు చేయడం జరుగుతుందన్నారు. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ప్రయోగాత్మకంగా జరుగుతున్న సర్వేను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, ఎదురయ్యే అన్ని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ప్రతి జిల్లాలోనూ అర్బన్ ప్రాంతాల్లో సర్వేను ప్రారంభించేందుకు కనీసం రెండు రోవర్లు, డ్రోన్లను కేటాయిస్తామని తెలిపారు. అలాగే గ్రామకంఠాలకు సంబంధించిన సమస్యను కూడా ప్రభుత్వం సానుకూలంగానే పరిశీలించిందని, అర్హులైన వారికి యాజమాన్య హక్కు పత్రాల జారీకి అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సమగ్ర సర్వే సందర్భంగా క్షుణ్ణంగా పరిశీలించకపోతే వివాదాస్పద భూములు, అటవీభూములకు కూడా పట్టాలు ఇచ్చే అవకాశం ఉందని, వీటి విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. దొంగ సర్టిఫికేట్లతో పెద్ద ఎత్తున అటవీభూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని, ఈ భూముల సర్వే సందర్భంగా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించాలని అన్నారు. భూసర్వేను వేగవంతం చేసేందుకు రోవర్లు, డ్రోన్ లను అదనంగా సమకూర్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీఎల్ఏ సాయిప్రసాద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్, పీసీసీఎఫ్ మధుసూధన్ రెడ్డి, సీసీఎల్ఏ సెక్రటరీ బాబు ఎ, సర్వే సెటిల్ మెంట్ కమిషనర్ సిద్ధార్థ జైన్, పీఆర్ కమిషనర్ కోన శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనంపై గొడ్డలివేటు ...!

- ప్రైవేటు డెవలపర్స్‌కు అనుకూలంగా నిబంధనావళి
- అడవి బిడ్డల అనుమతి, అంగీకారం లేకుండానే ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్
- అటవీ హక్కుల చట్టానికి కేంద్రం తూట్లు
- ఆదివాసీల బతుకులపై మోదీ సర్కార్ దాడి

**విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం:** అడవులనే నమ్ముకుని బతుకుతున్న కోట్లాది మంది గిరిజనం బతుకులపై మోదీ ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆదివాసీలు, గిరిజనుల అనుమతి అవసరం లేకుండా అటవీ భూముల్ని వివిధ ప్రాజెక్టులకు వినియోగించే ప్రక్రియకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. 'అటవీ పరిరక్షణ నిబంధనావళి- 2022'ను నోటిఫై చేస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఆదేశాలు జారీచేసింది. ప్రైవేటు డెవలపర్స్ చేపట్టే చెట్ల నరికివేత, ఇతర అభివృద్ధి పనులకు నిబంధనలను సడలించింది. అడవుల్లో నివసించే ఆదివాసీలు, గిరిజనులు, ఇతరుల అనుమతి అవసరం లేకుండా భూముల కేటా యింపు జరగనున్నది. అభివృద్ధి ప్రాజెక్టుల నిమిత్తం ఆ భూముల్ని ప్రైవేటు డెవలపర్స్ ఇకపై ఇష్టానుసారంగా వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. బాధితులకు నష్టపరిహారం చెల్లించే విధానం వారికి అనుకూలంగా కేంద్రం మార్చింది. 5 నుంచి 40 హెక్టార్ల అటవీ భూము లపై స్క్రీనింగ్ కమిటీ 60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్రం నోటిఫై చేసిన కొత్త నిబంధనావళిపై పర్యావరణ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నారు. అటవీ హక్కుల చట్టానికి తూట్లు పొడుస్తూ కొత్త నిబంధనావళిని కేంద్రం తీసుకొచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ హక్కుల చట్టం-2003లో పేర్కొన్న నిబంధనావళి స్థానంలో కొత్త నిబంధనావళి అత్యంత ప్రమాదకరమైన విధానమని, పాత నిబంధనావళి ప్రకారం మౌలిక వసతులు, అభివృద్ధికి సంబంధించి కట్టడాలు, ఇతర పనులు చేపట్టాలన్నా, అక్కడ నివసించే అడవి బిడ్డల అనుమతి, అంగీకారం తప్పనిసరిగా ఉండేది. అటవీ భూముల్ని ఏకపక్షంగా వేరే అవసరాలకు వాడటానికి ఉండేది కాదు. కానీ కొత్త నిబంధనావళి తీవ్రముప్పుగా మారింది.

మనదేశంలో అడవుల్ని నమ్ముకుని కోట్లాదిమంది జీవిస్తున్నారు. గనుల తవ్వకం, విద్యుత్ ప్రాజెక్టులు మొదలైనవాటి కోసం అడువుల నరికివేతకు మోదీ సర్కార్ సిద్ధమవుతోంది. బడా కార్పొరేట్లకు కేటాయించిన ఆ ప్రాజెక్టుల కోసం చట్టాల్లో మార్పులు చేస్తోంది. కొత్త నిబంధనావళి ప్రకారం, ఏదైనా ప్రైవేట్ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇవ్వగానే ప్రైవేట్ డెవలపర్స్ అడవుల్ని నరికివేసి భూముల్ని తమ ఆధీనంలోకి తీసుకోవచ్చు. ఆ తర్వాత ప్రాజెక్టు నిర్వాసితులు, బాధితులకు నష్టపరిహారం అందజేస్తుంది. బాధితుల పునరావాసం, అటవీ హక్కుల పరిరక్షణ జరిగిందా? లేదా? అన్నది రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుంది. కేవలం రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. ఇదంతా అత్యంత ప్రమాదకరమైనదిగా పర్యావరణ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘిస్తూ కేంద్రం నిబంధనావళిని రూపొందించిందని విమర్శించారు. 'వేదాంత' కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా నిబంధనావళి ఉందని తెలిపారు. తొలుత స్థానిక ఆది వాసీలు, గిరిజనుల అనుమతి తీసుకున్నాకే ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతామని 2015లో కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పుడు దానికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవ టమేంటని గిరిజనులు, ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.



## ప్రపంచ అగ్రశ్రేణి వర్సిటీల్లో గీతం విద్యార్థులకు ప్రవేశం

**విశాలాంధ్ర - మధురవాడ:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నుంచి వివిధ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు పూర్తి చేసిన 91 మంది విద్యార్థులకు ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో ఈ ఏడాది పరిశోధకులుగా అవకాశాలు లభించాయని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవికాంత్ తెలిపారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీలలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు మెకట్రానిక్స్, బయోమెడికల్ , ఫార్మస్యూటికల్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ విభాగాలలో గీతం విద్యార్థులు పరిశోధనలు జరపడానికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు విదేశాలలో ఉన్నత విద్యావకాశాలు పొందడానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# ఆర్కే ఇంట్లో ఎన్‌ఐఏ సోదాలు

- ప్రకాశం జిల్లా ఆలకురపాడు, విజయవాడలో విస్తృత తనిఖీలు
- కొన్ని డాక్యుమెంట్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- మావోయిస్టులకు సహకరిస్తున్నారనే సమాచారంతోనేనా...!

**విశాలాంధ్ర-టంగుటూరు/విజయవాడ క్రైం:** రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) మంగళవారం సోదాలు నిర్వహించింది. ప్రకాశం జిల్లా ఆలకురపాడులో ఆర్కే భార్య శిరీష ఇంటితో పాటు విజయవాడ నగరంలోని రెండు ప్రాంతాల్లో ఎన్‌ఐఏ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని డాక్యుమెంట్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులకు సహకరిస్తున్నారనే సమాచారంతోనే ఈ సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకురపాడులో ఆర్కే భార్య శిరీష ఇంట్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయి. శిరీష బంధువు, విరసం నేత కల్యాణ్‌రావు ఇంటిలోనూ తనిఖీలు చేశారు. ఇంటి తలుపు తీయాల్సిందిగా కల్యాణరావును ఎన్‌ఐఏ అధికారులు అడగగా... తాళాలు తన వద్ద లేవని ఆయన చెప్పటంతో తహసీల్దార్ పర్యవేక్షణలో తాళాలు పగలగొట్టి ఇంటిలో సోదాలు చేశారు. ఆ ప్రాంతానికి విలేకరులను అనుమతించలేదు. గతంలోనూ కల్యాణ్‌రావు ఇంట్లో సోదాలు జరిపారు. 150 మంది పోలీసులు ఆలకురపాడు గ్రామాన్ని స్వాధీనంలోకి తీసుకున్నారు. ఎన్‌ఐఏ బృందాలకు సింగరాయకొండ సీఐ లక్ష్మణ్, టంగుటూరు ఎస్‌ఐ ఎస్‌కే ఖాదర్‌బాషా సహకరించారు.

**విజయవాడలో రెండు ప్రాంతాల్లో తనిఖీ**

విజయవాడ నగరంలో రెండు ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) అధికారులు మంగళవారం సోదాలు చేశారు. ఎన్‌ఐఏ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు చేశారు. అజిత్‌సింగ్‌నగర్ రైతు బజార్ వెనుక లూనా సెంటర్‌లో అద్దెకు ఉంటున్న కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్ ఇంట్లో ఒక బృందం, కొత్త రాజరాజేశ్వరీపేట పరిధిలోని అమరావతి కాలనీ రెండో లైనులో నివాసం ఉంటున్న ఇటీవల మరణించిన ప్రజానాట్య మండలి నాయకుడు డప్పు రమేశ్ భార్య పి.జ్యోతి ఇంట్లో మరో బృందం సోదాలు చేసింది. విజయవాడకు తెల్లవారుజామున ఐదు గంటలకు వచ్చిన ఎన్‌ఐఏ అధికారులు 15 మంది దాదాపు పదిగంటల పాటు దుడ్డు ప్రభాకర్ ఇంట్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. స్థానిక పోలీసులు 40 మందితో ప్రభాకర్ ఇంటి చుట్టూ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన దుడ్డు ప్రభాకర్ విజయవాడలో ఉంటూ మావోయిస్టులకు ఆర్థిక సహకారం అందిస్తున్నారనే సమాచారంతో ఎన్‌ఐఏ అధికారులు తనిఖీలు చేసినట్లు తెలిసింది. ఎన్‌ఐఏ అధికారులు తనిఖీలు చేసే సమయంలో ప్రభాకర్ ఇంట్లోనే ఉన్నారు. కేవలం కొన్ని డాక్యుమెంట్లు, సెల్‌ఫోన్, ప్రజా సంఘాల కార్యక్రమాల వీడియోలను మాత్రమే ఎన్‌ఐఏ అధికారులు తీసుకుని వెళ్లడం విశేషం. అదేవిధంగా డప్పు రమేశ్ భార్య పి.జ్యోతి ఇంట్లో కూడా కొన్ని డాక్యుమెంట్లు, వీడియోలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆమెను ప్రశ్నించి కొంత సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఎన్‌ఐఏ అధికారులు వెళ్లిపోయిన తర్వాత దుడ్డు ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ విజయవాడ రాజధాని కావడంతో ప్రజా సంఘ బాధ్యుడిగా ఇక్కడ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నానని తెలిపారు. తామేమీ హంతకులు, తీవ్రవాదులం కాదని, ఎన్‌ఐఏ ఎందుకు తనిఖీలు చేసిందో తనకు తెలియదని చెప్పారు. ప్రజల కోసం పని చేస్తున్నవారిని వివిధ కారణాలతో వేధించడం కొత్తేమీ కాదని అన్నారు. ఎన్‌ఐఏ సోదాలకు వ్యతిరేకంగా ప్రభాకర్ ఇంటి ఎదుట 'ఉపా' చట్టం రద్దు పోరాట కమిటీ నాయకులు నిరసన తెలిపారు.

సంపాదకీయం

# కనీస మద్దతు ధరపై కపట నాటకం

రైతులు దిల్లీ పొలిమేరల్లో ఏడాదికి పైగా నిరసన వ్యక్తం చేసిన తరవాత వివాదాస్పద వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకుంటున్నట్టు గత నవంబర్‌లో ప్రధానమంత్రి మోదీ స్వయంగా ప్రకటించారు. ఆ తరవాత కొద్ది రోజులకే రైతులు తమ నిరసన విరమించారు. రైతులు ఉద్యమం చేసింది కేవలం వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా మాత్రమే కాదు. కనీస మద్దతు ధరకు చట్టపరమైన రక్షణ కల్పించాలన్న కోరిక కూడా వారి డిమాండ్లలో ప్రధానమైందే. దానిని చిత్తశుద్ధితో పట్టించుకోవడానికి మోదీ సర్కారు సిద్ధంగా లేదని మరోసారి రుజువైంది. రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన తరవాత ఎనిమిది నెలలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరల వ్యవహారాన్ని పరిశీలించడానికి ఒక కమిటీ వేసింది. ఈ కమిటీలో సభ్యుల పేర్లు చూస్తే చాలా గొప్పగానే కనిపిస్తుంది. కానీ తరచి చూస్తే కమిటీలో ఉన్న అత్యధికులు వివాదాస్పద వ్యవసాయ చట్టాలను సమర్థించిన వారే కనిపిస్తున్నారు. సహజంగానే సుదీర్ఘమైన రైతుల ఉద్యమానికి నాయకత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చా ఈ కమిటీని తిరస్కరించింది. దొడ్డి దారిన వివాదాస్పద చట్టాలను మళ్లీ తీసుకొచ్చే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందని సంయుక్త కిసాన్ మోర్చా అంటోంది. కేంద్ర ప్రభుత్వంలో ఇదివరకు వ్యవసాయ శాఖ కార్యదర్శిగా పని చేసిన సంజయ్ అగర్వాల్ ఈ కమిటీకి చైర్మన్‌గా ఉంటారు. ఆయన ప్రభుత్వానికి పూర్తిగా అనుకూలుడని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కేంద్ర ప్రభుత్వం మొక్కుబడిగా కమిటీ అయితే వేసి ఈ సమస్యను మరి కొన్నాళ్లు సాగదీయాలని చూస్తున్నట్టు స్పష్టం అవుతోంది. సమస్యను పరిష్కరించే ధోరణి ఎక్కడా కనిపించడం లేదు. అన్నింటికన్నా మించి ఈ కమిటీ కనీస మద్దతు ధరలకు చట్ట ప్రతిపత్తి కల్పించడానికి కృషి చేస్తుందన్న సూచన కూడా లేదు. గత నవంబర్‌లో వివాదాస్పద వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించినప్పుడు రైతులకు క్షమాపణ చెప్పడంతో పాటు కనీస మద్దతు ధర అంశాన్ని చర్చిస్తామని కూడా హామీ ఇచ్చారు. ఆ హామీ ఇంతవరకు నెరవేరకపోగా ప్రభుత్వానికి అనుకూలమైన వారికి ఆ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించడాన్నిబట్టి చూస్తే కనీస మద్దతు ధరకు చట్ట ప్రతిపత్తి కల్పించే ఉద్దేశం ప్రభుత్వానికి ఏ కోశానా ఉన్నట్టు కనిపించడం లేదు. ఈ కమిటీలో నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్, వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త సి.ఎస్.సి. శేఖర్, అహమదాబాద్ ఐ.ఐ.ఎం.కు చెందిన సుఖ్ పాల్ సింగ్, వ్యవసాయ ధరల కమిషన్‌లో సీనియర్ సభ్యుడు నవీన్ పి.సింగ్ మొదలైన వారు ఉంటారని మంగళవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గజెట్ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ కమిటీలో జాతీయ అవార్డు సాధించిన భరత్ భూషణ్ త్యాగీతో పాటు సంయుక్త కిసాన్ మోర్చాకు చెందిన ముగ్గురు సభ్యులు, ఇతర రైతు సంఘాలకు చెందిన గుణ్వత్ పాటిల్, క్రిష్ణవీర్ చౌదరి, ప్రమోద్ కుమార్ చౌదరి, గుణి ప్రకాశ్, సయ్యద్ పాశా పటేల్ కూడా ఉంటారట. రైతులు దిల్లీ పొలిమేరల్లో ఉద్యమం చేస్తున్నప్పుడు వారి పక్షాన నిలబడి ఒక్క మాటైనా మాట్లాడిన వారు ఇంతమందిలో ఎంత వెదికినా ఒక్కరు కూడా కనిపించడం లేదు. రైతుల సహకార సంఘాలకు చెందిన ఇద్దరు, ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘాని, సి.ఎన్.ఆర్.ఐ. ప్రధాన కార్యదర్శి వినోద్ ఆనంద్ కూడా ఈ కమిటీలో ఉంటారట. ఈ జాబితా అక్కడితో ముగియలేదు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల సీనియర్ సభ్యులు, ప్రభుత్వ కార్యదర్శులు అయిదుగురు ఉంటారట. ఈ కార్యదర్శులు ఆంధ్రప్రదేశ్, సిక్కిం, ఒరిస్సా, కర్నాటక రాష్ట్రాలకు చెందినవారు. వీరందరూ రైతుల అసలు డిమాండు అయిన కనీస మద్దతు ధరకు చట్టప్రతిపత్తి గురించి మాట్లాడతారని అనుకోవడానికి అవకాశమే లేదు.

కమిషన్ ఏర్పాటు విషయంలోనూ ప్రభుత్వం ఏకపక్షంగానే వ్యవహరించింది. ఈ కమిటీ ఏర్పాటు చేయడానికి ముందు ఉద్యమానికి నాయకత్వం వహించిన రైతు నాయకులెవరినీ సంప్రదించిన దాఖలాలు లేవు. ఏకపక్షంగా కమిటీ నియమించేసి ఓ పని అయిపోయింది అనిపించుకోవడానికే ప్రభుత్వం ప్రయత్నించిందని రుజువు అవుతోంది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులోని మతలబు గమనించినా రైతుల కోర్కెను తీర్చే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదని స్పష్టమవుతోంది. ఈ కమిటీ రైతులకు కనీస మద్దతు ధర అందే మార్గాలను పరిశీలిస్తుందట. కనీస మద్దతు ధర అందించే వ్యవస్థను మరింత పటిష్టం చేసే అంశాన్ని పరిశీలిస్తుందట. వ్యవసాయ వ్యయం, ధరలను దాపరికం లేకుండా నిర్ణయించే అంశాన్ని పరిశీలిస్తుందట. దీనికోసం వ్యవసాయ ధరల కమిషన్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే అంశాన్నీ అన్వేషిస్తుందట. అంటే ఇంతవరకు ఆ కమిషన్ పరాధీనంగా అంటే ప్రభుత్వం మీద ఆధారపడే పని చేస్తోందని తేలిపోతోంది. దేశంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలో సూచిస్తుందట. రైతులకు గిట్టుబాటు ధర లభించేట్టు చూస్తుందట. దేశీయ, ఎగుమతుల అవకాశాలను కూడా బేరీజు వేస్తుందట. మరీ విచిత్రం ఏమిటంటే కనీస మద్దతు ధర అంశాన్ని పరిశీలించవలసిన ఈ కమిటీ ప్రకృతిసిద్ధ వ్యవసాయం ఎలా చేయాలో, పంటల్లో వైవిధ్యం ఎలా ఉండాలో, సూక్ష్మ నీటిపారుదల పథకాల వైనం ఏమిటో పరిశీలించి కృషి విజ్ఞాన కేంద్రాలను, ఇతర పరిశోధన, అభివృద్ధి సంస్థలు ఏం చేయాలో కూడా సిఫార్సు చేయాలట. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దాటవేస్తోందని రైతులు ఎప్పుడో గ్రహించారు. అందుకే తాజా పరిస్థితిని చర్చించడానికి సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు మంగళవారం సమావేశం అయ్యారు. ఆ సమావేశంలోనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీని తిరస్కరించాలని నిర్ణయించారు. ఈ తిరస్కరణలో రైతు నాయకుల్లో పూర్తిస్థాయి ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. రైతుల సమస్యతోనూ, ఉద్యమంతోనూ ఎలాంటి సంబంధం లేని ఈ కమిటీ తమకు ఆమోద యోగ్యం కాదని తెగేసి చెప్పారు. ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన రైతు నాయకులందరూ ఈ కమిటీని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. అంటే రైతుల్లో ఎంతటి అసంతృప్తి గూడు కట్టుకుని ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఈ కమిటీ ఏర్పాటు చేసిన తీరు చూస్తే రద్దు చేసిన వివాదాస్పద చట్టాలను దొడ్డిదారిన మళ్లీ ప్రవేశ పెట్టాలన్న కుట్ర బాహాటంగా కనిపిస్తోందని రైతు నాయకులు అంటున్నారు. ఈ కమిటీలో కార్పొరేట్ రంగానికి చెందిన వారికి చోటివ్వడం చూస్తే రైతుల ఆందోళన సబబైందిగానే కనిపిస్తోంది. ఈ కమిటీ పరిశీలనాంశాల్లో మద్దతు ధరకు పరిమితం కాకుండా ఇతరేతర అంశాలను చేర్చడంలోనే ప్రభుత్వ కుతంత్రం బయటపడ్తోంది. కేవలం ఒక లాంఛనం పూర్తి చేయడం మీదే ప్రభుత్వం దృష్టి సారించింది. కేవలం కనీస మద్దతు ధర గురించే పరిశీలించే కమిటీ మాత్రమే ఉండాలన్నది రైతుల వాదన. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేదాకా తమ పోరాటం కొనసాగుతుందని రైతు నాయకులు ప్రకటించారు. ఈ కమిటీ ఏర్పాటులో ఉన్న డొల్లతనాన్ని కనిపెట్టినందువల్లే సంయుక్త కిసాన్ మోర్చా తమ తరఫున ఈ కమిటీలో ఉండే వారి పేర్లేవీ తెలియజేయలేదు. రైతులు మళ్లీ ఇదివరకటి స్థాయిలోనే ఉద్యమించగలరా లేదా అన్న విషయంలో భిన్నాభి ప్రాయాలు ఉండవచ్చు. అదే జరిగితే ప్రభుత్వం కొరివితో తల గోక్కోవడానికీ, కార్పొరేట్లకు దోచి పెట్టడానికే సిద్ధ పడ్తోందని మాత్రం అర్థం అవుతోంది.

# ప్లాస్టిక్‌ను పంపించేద్దాం

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి

సకల ప్రాణికోటి రక్షణకు, మానవాళి సుఖ జీవనానికి బాటలు వేసే ప్లాస్టిక్‌పై నిషేధం సంతోషదాయకం. అతి ప్రమాదకరమైన ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ను నిషేధించిన 100 దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరింది. గతంలోనూ ప్లాస్టిక్ నియంత్రణకు ప్రయత్నాలు జరిగాయి కానీ గట్టి పట్టు చూపించలేదు. ఆచరణ లోపంతో ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో మళ్ళీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా తయారైంది. ప్లాస్టిక్ వాడకం ఇన్నాళ్ళూ యథేచ్ఛగా సాగింది.

భూమండలానికి, జీవకోటి మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాల్సిందే. ప్లాస్టిక్‌ను పంపించేయాల్సిందే. ఇందుకు ప్రభుత్వాలతో పాటు ప్రజలూ గట్టి సంకల్పం తీసుకోవాలి. దేశవ్యాప్తంగా మహా నగరాలు, పట్టణాలు, వీధులు, నాలాలు, పల్లెలు, నదులు, మహా సముద్రాలు అన్నీ ఎక్కడ చూసినా ఎటు చూసినా ప్లాస్టిక్ గరళమే. స్ట్రాలు, కప్స్, గ్లాసులు, ప్లేట్‌లు మొదలుకొని ఎన్నో రకాల ప్లాస్టిక్ అవశేషాలతో ఇవన్నీ నిండిపోయాయి. ఇప్పుడు వీటిపై నిషేధం విధించారు. థర్మకోల్, డిస్పోజబుల్ ప్లాస్టిక్, కప్స్, గ్లాసెస్, ఇయర్ బడ్స్, ఐస్‌క్రీమ్ కప్స్, స్వీట్ బాక్సులు, కత్తులు, పివిసి బ్యానర్లు, ప్లేట్లు, ట్రేలు, స్పూన్లు, బెలూన్లకు వాడే ప్లాస్టిక్ స్టిక్స్, ప్లాస్టిక్ జెండాలు, ప్లాస్టిక్ అలంకార సామాగ్రి, సిగరెట్ పెట్టెలు లాంటి 19 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగ ఉత్పత్తులను వాడరాదని ఆజ్ఞలు జారీ చేశారు. ఇకపై ఈ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను తయారు చేసినా, నిల్వ ఉంచినా, పంపిణీ చేసినా, విక్రయించినా చట్ట వ్యతిరేకం, దండనీయం.

భారత్‌లో ఏడాదికి దాదాపు 14 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు. 1950 నుంచి దేశవ్యాప్తంగా 8.3 బిలి యన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్ప త్తి కాగా, దీనిలో కనీసం 60 శాతం నేల, నీటిని కలుషితం చేయడంతో ప్రాణుల మనుగడకే ముప్పు ఏర్పడింది. ఐరాస అంచ నాల ప్రకారం దాదాపు 100 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాలను చేరి జలచరాలకు ప్రాణాంతకంగా మారాయి. అనేక జల చరాలు, ఇతర జంతువుల శరీరాల్లోకి చేరుతున్న మైక్రో ప్లాస్టిక్ వాటి ప్రాణాలకే ముప్పు తెస్తోందని శాస్త్రజ్ఞులు ఏనాడో హెచ్చరించినా ఎవరి చెవికీ ఎక్కలేదు. ప్లాస్టిక్ నిషేధ నిర్ణయంతో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరుగుతాయని ప్లాస్టిక్ ఉత్పత్తిదారులు కుటిల వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదం, స్వార్థపూరితం.

ఐరాస పర్యావరణ కార్యక్రమం అంచనా ప్రకారం నిమిషానికి ఒక మిలియన్ ప్లాస్టిక్ బాటిల్స్ అమ్ముడుపోతున్నాయి. సాలీనా 5 ట్రిలియన్ల ప్లాస్టిక్ సంచులు ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్నారు. మొత్తం ప్లాస్టిక్ ఉత్పత్తుల్లో 50 శాతం ఒకసారి వాడి పడేసేవే. అందువల్లే ప్లాస్టిక్ సమస్య ప్రపంచ సమస్యగా మారింది. ప్లాస్టిక్ కట్టడికి ప్రపంచ దేశాలు సత్వరమే నడుం కట్టాలి. ఈ ఏడాది జనవరిలో ఫ్రాన్స్ ప్రభుత్వమూ పండ్లు, కూరగాయలు, వస్తు ప్యాకింగ్‌ల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించింది.

భారత్, ఫ్రాన్స్ దేశమేదైనా ప్లాస్టిక్ నిషేధానికి నిర్ణయం తీసుకుంటే సరిపోదు క్షేత్రస్థాయిలో కఠిన పర్యవేక్షణతో ఖచ్చితంగా అమలు చేయాలి. భారత్‌లోని అన్ని రాష్ట్రాలు ప్రమాదకర గుట్కా ఉత్పత్తుల తయారీ, నిల్వ, పంపిణీ, అమ్మకాలను నిషేధించినా నేడు మారుమూల గ్రామాల్లో సహితం అక్రమ రవాణా గుంపుల ద్వారా గుట్కా అమ్మకాలు ఇష్టానుసారంగా జరగడం బహిరంగ రహస్యమే. ప్లాస్టిక్ విషయంలోనూ ఇదే జరిగితే నిషేధం పైపై మాటలకే పరిమితమవుతుంది.

ప్లాస్టిక్ ఉత్పత్తికి అనేక దశల్లో కలిపే 8000 రకాల రసాయనాల్లో కొన్ని అత్యంత విషపూరితమైనవి. ఇవి భూతాపాన్ని పెంచుతున్నాయి. సామాన్య ప్రజానీకానికి ప్లాస్టిక్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడంతో పాటు పేపరు, నూలు, స్టీల్ పాత్రల వాడకాన్ని ప్రోత్సహిస్తేనే ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధం సత్ఫలితాలను ఇస్తుంది. అధికార యంత్రాంగం అలసత్వం, అధికారుల కొరత, అవినీతి చేతులు, వ్యాపారుల అక్రమాలు, రహస్య ఉత్పత్తులు/నిల్వలు, వినియోగదారుల నిర్లక్ష్యం లాంటి కారణాలతో నిషేధ అమలుకు తూట్లు పొడవరాదు. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986 సెక్షన్ 15 ప్రకారం లక్ష రూపాయలు వరకు జరిమానా, 5 ఏండ్ల వరకు జైలు శిక్ష లేదా రెండూ ఏకకాలంలో విధించవచ్చనే విషయాలను బహుళ ప్రచారం చేయాలి.

ప్లాస్టిక్ విష వ్యర్థాలతో మానవాళి సహజీవనం చేయాల్సిన అగత్యం ఇకపై వద్దు. బాధ్యతగల పౌరులుగా ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం. రేపటి తరానికి ఆరోగ్యకరమైన భూగోళాన్ని, పరిశుద్ధ జల నిధులను, స్వచ్ఛమైన గాలిని ప్రకృతి ప్రసాదంగా అందిద్దాం. జీవుల నివాసానికి ఒకే భూమి ఉందని, నివాసయోగ్యత గల మరో ప్రత్యామ్నాయ గ్రహం లేదని గ్రహిద్దాం. ప్లాస్టిక్ గరళ భూతాన్ని పారద్రోలుదాం.

వ్యాస రచయిత సెల్ 994970003

# అడవులూ బడా కార్పొరేట్లకే

డా. సోమ మర్ల

రాష్ట్రపతి పదవికి ద్రౌపది ముర్మును ప్రకటిస్తూ, ఆమె గిరిజనుల అభ్యు న్నతికి గొప్ప సేవ చేశారని పాలక బీజేపీ ప్రశంసలు కురిపించింది. అయితే అటవీ హక్కుల చట్టం 2006కు (ఎఫ్‌ఆర్‌ఎ) బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించనున్న మార్పులు గిరిజనుల ప్రయోజనాలకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయి. బడా కార్పొరేట్ కంపెనీలకు అడవులను కట్టబెటే ఈ మార్పులు గిరిజనులకు నష్టం కలిగిస్తాయి. ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో అమలులో ఉన్న అటవీ బిల్లును 2006కు మార్పుల చట్టం ప్రతిపాదించనున్నారు. ఈ మార్పులు గిరిజనుల ప్రయోజనాలు దెబ్బతీసి బడా కార్పొరేషన్లకు ప్రయోజనం కల్పిస్తాయి. గిరిజనుల జీవనానికి ఎంతగానో తోడ్పడుతున్న అడవులను చట్టంలో మార్పుల ద్వారా ప్రైవేటు కార్పొరేషన్లు గనుల తవ్వకానికి, ఔషధ కంపెనీలకు కట్టబెడ తారు. ఈ మార్పులు గిరిజనుల ప్రయోజనాలకు హాని చేయడమేగాక పర్యా వరణం కలుషితం కావడానికి కారణమై ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి. అటవీ హక్కుల చట్టం 2006కు కేంద్ర వాతా వరణ మంత్రిత్వ శాఖ మార్పులను ప్రతి పాదిస్తున్నది. ఎఫ్‌ఆర్‌ఎని యుపిఎ ప్రభుత్వం వామపక్షాల తోడ్పాటుతో 2006లో తీసుకువచ్చింది. గిరిజనుల ప్రయోజనాల కోసం చట్టం చేయాలని వామపక్షాలు గట్టిగా డిమాండ్ చేస్తూ వచ్చాయి. భారతదేశంలోని అడవుల్లో దాదాపు 20 కోట్ల మంది గిరిజనులు నివసిస్తున్నారు. వీరి జీవన భృతికి ఎక్కువగా అడవులే ఆధారం. వీరిలో పదికోట్ల మంది అడవుల కోసం కేటాయిం చిన భూమిపై ఆధారపడి జీవిస్తున్నారు. నిజంగా అడవులలో బతుకుతున్న గిరిజనులు జీవన వనరులను కాపాడుతున్నారు.

కొత్తగా ప్రతిపాదించనున్న 2022 అడవుల రక్షణ నియమ నిబంధనల్లో వాతావరణ మంత్రిత్వ శాఖ నిబంధన 6 (బి) (2) చేరుస్తున్నది. దీని ప్రకారం అటవీ హక్కుల చట్టం 2006తో నిమిత్తం లేకుండా అటవీ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించవచ్చు. గ్రామ సభ ఆమోదం కూడా అవసరం లేకుండా జిల్లా కలెక్టరు మార్పులు చేసేం దుకు ఆయనకు హక్కు కల్పించారు. నామ మాత్రం ఫీజు వసూలు చేసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడతారు. ఈ భూములు తీసుకున్న ప్రైవేటు వ్యక్తులు చెట్లు నరకడానికి, జంతు రక్షణ ప్రాంతాన్ని మరోచోటికి తరలించి ఆ భూములలో గనులు తవ్వకోడానికి, భవనాలు నిర్మించడానికి అపరిమితమైన యాజమాన్య హక్కులు కలిగి ఉంటారు.

బ్రిటీషు వలస పాలన కాలంలో 1878లో భారత అటవీ చట్టం చేశారు. ఈ చట్టం ప్రకారం అటవీ ఉత్పత్తులను ఎలాంటి ఆటంకం లేకుండా రవాణా చేయవచ్చు. అపారమైన అటవీ సంపదను, కలపను ఇంగ్లాండ్‌కు ఎగుమతి చేయడానికి పెద్ద సంఖ్యలో చెట్లు నరకడానికి ఇది ఉద్దేశించింది. నరికే చెట్లు, ఇతర కలప, వెదురు పైన సుంకం విధించవచ్చు. 1810-1950మధ్య కాలంలో దాదాపు 40 శాతం అడవి కుంచించుకు పోయింది. ఫలితంగా భారత ఉపఖండంలో రుతువుల తీరులో మార్పులు, వర్షాభావాలు, కరవులు వచ్చాయి. అనేక శతాబ్దాల పాటు అడవుల సహజ రక్షకులుగా గిరిజన తెగల ప్రజలు ఉన్నారు. ఈ చట్టం వల్ల తమ పూర్వీకుల నుండి వస్తున్న అటవీ, సాంస్కృతిక హక్కులను కోల్పోతారు. వలస పాలకులు గిరిజనులను అడవుల నుండి గెంటివేశారు. వలస పాలకులు 1878లో తీసుకు వచ్చిన చట్టం వల్ల గిరిజను లకు కలిగిన చారిత్రక అన్యాయాన్ని పరిష్కరించి తిరిగి వారికి హక్కు కల్పించేం దుకే యుపిఎ ప్రభుత్వం 2006 ఎఫ్‌ఆర్‌ఎను తెచ్చింది. 2006లో చేసిన ఎఫ్‌ఆర్‌ఎ గిరిజనులు ఇంకా ఇతర సంప్రదాయ ప్రజలు అడవులలో నివసించేం దుకు హక్కు కల్పించింది. ఫలితంగా వీరంతా తమ జీవన భృతికి, నివసించడానికి, సామాజిక, సాంస్కృతిక అవసరాలను తీర్చుకొనేందుకు అర్హత పొందారు. 2022లో అటవీ చట్టంలో మార్పుల బిల్లులో సెక్షన్లు 6 (1ఎ), (1బి) లను చేర్చారు. ఇవి జీవ వైవిధ్యంపై ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సదస్సు, అందుబాటు, ప్రయోజనంలో భాగస్వామ్యం (ఆర్టికల్ 5) అంశాలకు పూర్తిగా విరుద్ధం. ఈ సదస్సుల తీర్మానాలపై భారతదేశం సంతకం కూడా చేసింది.

కొత్తగా 2022లో మార్పు చేస్తున్న అటవీ రక్షణ నిబంధనలు వల్ల చెట్ల నరికివేతపై యాజమాన్య హక్కు, సహజ ఆహ్లాదకరమైన వాతావరణం, పక్షులు, పూలు, పండ్ల సౌందర్యం పూర్తిగా ధ్వంసమవుతాయి. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం సంప్రదాయంగా శతాబ్దాలుగా అడవులలో నివసిస్తున్న ఎస్‌టిలు, ఎప్పటి నుంచో అడవులలో నివసిస్తున్న ఇతర తెగల ప్రజలను రక్షించాలన్న రాజ్యాంగ విధులను గాలికి వదిలేస్తోంది. 'సరళతర వాణిజ్యం' పేరుతో వాతావరణ మంత్రిత్వ శాఖ గ్రామ సభల, రాష్ట్ర ప్రభుత్వాల, వివిధ ప్రజా కమిటీల ఆమోదంతో పని లేకుండా అటవీ భూములను ఇతర అవసరా లకు వినియోగించడానికి ఆమోదించే మార్గాలను రూపొందించింది. కొద్దిమంది నియమిత అధికారులతో కూడిన అతి తక్కువ యంత్రాంగం, వాతావరణ శాఖ సలహాల కమిటీ ద్వారా పని ముగించుకునే ఎత్తుగడ వేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే అటవీ భూములను ఇతర అవసరాలకు వినియోగించుకొనేందుకు ఆమోదం తెలియజేసేందుకు అటవీ నిరంకుశ అధికార యంత్రాంగం నియం త్రించటానికి లైసెన్సు ఇచ్చేసింది. అంతేకాదు అటవీ భూములను ఇతర పనులకు మళ్లించటానికి గ్రామ సభల ఆమోదం తప్పనిసరి అని సుప్రీంకోర్టు 2003లో ఇచ్చిన తీర్పును సైతం ఈ సవరణలు ఉల్లంఘిస్తున్నాయి.

అయితే వాతావరణ మంత్రిత్వ శాఖను గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీవ్రంగా విమర్శించింది. అటవీ హక్కుల చట్టానికి సంబంధించి తమది మోడల్ సంస్థ అని, అందువల్ల వాతావరణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను పరిగణలోకి తీసుకోవలసిన అవసరం లేదని స్పష్టం చేసింది. అయితే ప్రధాన మంత్రి కార్యాలయం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అభ్యంతరాలను తిరస్కరించింది. ప్రధాని కార్యాలయం ఆదేశాల ప్రకారం వాతా వరణ శాఖ ఎఫ్‌ఆర్‌ఎ 2006 చట్ట సవరణల ముసాయిదాను రూపొందించింది. భారతదేశ అడవులు 17 వేల రకాల పూల చెట్లు, జంతువులకు నివాసమైంది. అడవుల పరిరక్షణ కార్యకర్తలు, న్యాయ నిపుణులు, జీవ శాస్త్రవేత్తలు ఈ సవరణ లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నియమ నిబంధన లను నీరుగారిస్తే అటవీ సంరక్షణకు తీవ్ర హాని కలుగజేస్తుంది, జీవ వైవిధ్యానికి చేస్తున్న కృషి ఉపయోగం లేకుండా పోతుంది. దేశ మూలవాసులు పొందుతున్న అటవీ ఉత్పత్తుల ప్రయోజనాలలో భాగస్వామ్యం ఉండాలన్న సూత్రానికి విరు ద్ధంగా ఉంటాయి. జీవ వనరుల రక్షకులు ఆదివాసీలు. సెక్షన్ 6(1ఎ), (1బి) ని సవరణ బిల్లులో చేర్చారు. ఇది జీవ వైవిధ్య పరిరక్షణ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధ మైంది. అంతేకాదు ప్రజల అభిప్రాయాలు, ముందుగానే చట్టసభల సంప్ర దింపుల విధానాన్ని రూపొందించటం తప్పనిసరి. అయినప్పటికీ వీటిని పాటించకుండా ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టా లని నిర్ణయించారు. అడవులు "ఈ విశ్వం ఊపిరితిత్తులు" అని తరుచుగా పేర్కొంటాం. ఎందుకంటే చెట్లు కర్బనపు వాయువులను పీల్చుకుని ప్రాణ వాయువును మనకు అందిస్తాయి. వర్ష సహిత అడవులు ప్రపంచానికి అవసర మైన ప్రాణవాయువులో 40 శాతాన్ని మనకు ఇస్తాయి. అడవి ఈ ధరణి ఊపిరితిత్తులన్న నిర్వచనం ఉంది. అడవుల విధ్వంసానికి ఎటువంటి చట్ట చర్యలు తీసుకున్నా ధరణి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. అందువల్ల 2006లో చేసిన ఎఫ్‌ఆర్‌ఎకు చేస్తున్న సవరణలను తక్షణం ఉపసంహరించాలి. ఈ సవరణలు బడా ప్రైవేటు కంపెనీలకు, ఔషధ పారిశ్రామికులకు మాత్రమే ప్రయోజనం కల్పిస్తాయి. వీటిని రద్దుచేసి గిరిజనుల హక్కులను పరిరక్షించాలి. అడవులు మరింతగా తరిగిపోవడాన్ని నివారించాలి.

ఐ-మెయిల్

## పెరుగుతున్న పన్నులు- తరుగుతున్న సదుపాయాలు

నిరంకుశ మోదీ ప్రభుత్వం జీఎస్టీ బాదుడు నిత్యావసరాల మీదకూ మళ్ళించింది. మనదేశంలో డీజిల్, పెట్రోల్ పై చెల్లించే పన్ను ప్రపంచంలోనే అత్యధికం. పరోక్ష పన్నులు ప్రభుత్వాలు వసూలు చేసే పనులలో మూడింట రెండు వంతులు వరకు ఉంటాయి. ప్రజలు ప్రభుత్వాలకు చెల్లించే పన్నులు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. ప్రజలకు ఉపయోగపడే ఆరోగ్య రక్షణ, విద్య, నీటి సరఫరా, రోడ్లు లాంటి మౌలిక సదుపాయాలు మాత్రం రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు, ప్రభుత్వ ఆసుపత్రులకు నిధుల కొరత. కార్పొరేట్ శక్తులు ఈ రంగాలలోకి ప్రవేశించడంతో సామాన్యుల పరిస్థితి మరింత ఘోరంగా మారింది. కరోనా మహమ్మారి సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన వసతులు లేక ప్రవేట్ ఆసుపత్రుల్లో బిల్లులు చెల్లించలేక చనిపోయినవారు ఎంతో మంది ఉన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వారికి అప్పజెప్పేందుకు నష్టాలు సాకు చూపిస్తోంది. లాభనష్టాల లెక్కలు పట్టింపు లేని విలువైన ఆస్తులు కలిగిన బెంగుళూర్‌లోని ఎచ్‌ఏఎల్, రైల్ వీల్ ఫ్యాక్టరీలను ప్రైవేట్ వారికి అప్పగిస్తే ఉత్పత్తి




నిలిపివేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే అవకాశం ఉంది. ఎందుకంటే నగరాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. ఉత్పత్తి రంగం కంటే రియల్ ఎస్టేట్ రంగంలో ప్రైవేటు వారికి లాభం ఎక్కువ. రైల్వే స్టేషన్ల నిర్వహణ బాధ్యతల నుండి ప్రభుత్వం తప్పుకొని బడా పారిశ్రామిక వేత్తలకు అప్పగించడం వల్ల ప్లాట్‌ఫాం టికెట్ రేటు పెరిగింది. నీరు, ఇతర పానీయాలు, టాయిలెట్‌ల వినియోగంపై అధిక ఛార్జీలు వసూలు చేయడం వల్ల ప్రజలు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

ఆళవందార్ వేణు మాధవ్

# ఎస్కలేటర్ మీద డాలర్ - వెంటిలేటర్ మీద రూపాయి

ఎం. కోటేశ్వరరావు

మన కరెన్సీ రూపాయి ఏ రోజు ఎంత పతనం అవుతుందో తెలియని స్థితిలో ఉన్నాం. అత్యంత హీనంగా డాలరుకు రూ. 80లు అయ్యింది. ఇక్కడితో ఆగుతుందా లేక ఇంకా దిగజారుతుందా అనేది మోదీనే చెప్పాలి. నానాటికీ రూపాయి విలువ పడిపోతున్న నేపథ్యంలో దాని పుట్టుపూర్వోత్తరాలను ఒకసారి పరిశీలిద్దాం. పురాతన చరిత్ర కలిగిన కరెన్సీలలో మన రూపాయి కూడా ఒకటి. క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దిలోనే నాణాన్ని విడుదల చేసినట్లు చెబుతున్నారు. క్రీస్తు పూర్వం 340-290 కాలంలో చంద్రగుప్త మౌర్యుడి పాలనలో ప్రధాన మంత్రిగా ఉన్న చాణుక్యుడు రాసిన అర్థశాస్త్రంలో స్వర్ణ రూప, సీస రూప, తామ్ర రూప నాణాలతో పాటు రూపయ రూప అంటూ వెండినాణెం గురించి కూడా ప్రస్తావన ఉంది. తరవాత కాలంలో ఉన్న కరెన్సీ లేదా ద్రవ్య వ్యవస్థల గురించి అంత స్పష్టంగా లేదు. షేర్ షా సూరి పాలన 1540-45లో 178 గ్రెయిన్స్ (తేలికైన గింజలు) లేదా 11.53 గ్రాముల బరువుతో వెండి నాణాలను ప్రమాణికంగా తయారు చేయించి దానికి రుపియా అని కూడా పేరు పెట్టారు. ఇప్పుడు ఒక డాలరుకు ఇన్ని రూపాయలు అన్నట్లుగా బాబరు కాలంలో 50 ఇత్తడి నాణాలకు రెండు వెండి నాణాలు సమంగా ఉండేవి. బ్రిటీష్ వారు అధికారానికి వచ్చే వరకు ఇవి కొనసాగాయి. బ్రిటీషు వారి ఏలుబడిలో మన రూపాయి పతనం తొలిసారిగా 1873లో జరిగిందని చెప్పవచ్చు. ఐరోపా, అమెరికాలో తీవ్ర ఆర్థిక మాంద్యం సంభవించింది. ఆరు సంవత్సరాల పాటు కొనసాగింది. అమెరికా, అనేక ఐరోపా వలస దేశాలలో వెండి నిల్వలను కనుగొనటం కూడా దీని కారణాలలో ఒకటి. విస్తారంగా దొరుకుతున్న కారణంగా దీని విలువ తగ్గి బంగారానికి గిరాకీ ఏర్పడింది. దాంతో అప్పటి నుంచి బంగారం ప్రామాణికంగా విదేశీ లావాదేవీలు నడిచాయి.

ఇక వర్తమానానికి వస్తే 1947ఆగస్టు 15న మన రూపాయి ఒక డాలరుకు సమంగా ఉన్నట్లు సమాచారం, ఏడాది సగటు రూ.3.50 గా, రూ.4.16గా ఉందని రెండు రకాల వార్తలు ఉన్నాయి. కొనుగోలు, అమ్మకం ధరల్లో తేడా కూడా ఈ గందరగోళానికి కారణం కావచ్చు. ఒన్ ఇండియా డాట్ కామ్‌లో 2020 ఆగస్టు 14న ప్రచురితమైన విశ్లేషణ ప్రకారం 2005 జనవరిలో రూ.43.47గా, 2014 మే నెలలో రూ. 59.44గా ఉంది. అప్పటి నుంచి మధ్యలో హెచ్చుతగ్గులున్నా మొత్తం మీద ఈ నెలలో రు.79.99కి

పడిపోయింది. ఇక రూపాయి పతనం గురించి వివిధ పత్రికలతో పాటు ట్విట్టర్‌లో వచ్చిన వ్యాఖ్యలు మన దేశ దుస్థితికి అద్దం పడుతున్నాయి. వాటిలో కొన్ని ఇవీ... ఎస్కలేటర్ మీద డాలర్, వెంటిలేటర్ మీద రూపాయి, ఐసియులో దేశం.. దేవుడు రక్షించుగాక. హమ్మయ్య ఎట్టకేలకు జరిగింది.. దశాబ్దాల తరవాత పెట్రోలు కంటే ఇప్పుడు బీరు చౌక. ఇంక మనం కొత్త నినాదం ఇవ్వవచ్చు తప్పతాగండి బండి మాత్రం నడపొద్దు. రూపాయి-డాలరు బంధం పటిష్టత గురించి డాలరుతో చర్చలకు భారత్ సిద్ధం. డిస్నీలాండ్ కొత్త రైడ్‌ను ప్రారంభిస్తోంది. దానిలో ఎంతో ఎత్తు నుంచి కొద్ది సెకండ్లలోనే కిందికి జారిపోవచ్చు. దానికి వారు భారత రూపాయి అనే పేరు పెట్టబోతున్నారు. రూపాయి సీనియర్ సిటిజన్‌గా మారినందుకు అభినందనలు. రూపాయి పైకి వెళ్లేది ఒకే ఒక్కసారి అది టాస్ వేసినపుడు. రూపాయిని రక్షిం చాలంటే ఒకే మార్గం ఉంది, డాలరుకు రాఖీ కట్టి రక్షించమని అడగాలి. మీరు గనుక జీవితంలో ఓడినట్లు విచారపడుతుంటే ఒక్కసారి రూపాయిని చూడండి.

బిసిసిఐ అభిజ్ఞవర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం రూపాయి పతనం సర్ డాన్ బ్రాడ్‌మన్ బాటింగ్ సగటును దాటే అవకాశం ఉందనే భయం కూడా ఉంది. రూపాయి వేగాన్ని సచిన్ టెండూల్కర్ కూడా అధిగమించలేదు. ఒకనాడు తన కెరీర్‌ను కాపాడుకొనేందుకు రాహుల్ ద్రావిడ్ వికెట్ కీపింగ్ చేపట్టాడు. రూపాయిలో మార్పులు రావాలని కూడా ద్రావిడ్ చెప్పాడు. బహుశా నోట్లు గుండ్రంగాను, నాణాలను చతురస్రంగా మార్చాలని కావచ్చునని బిసిసిఐ వర్గాలు చెప్పాయి. రూపాయికి ఒక విలువను నిర్ణయించలేమని శ్రీశాంత్ ట్వీటాడు. బిసిసిఐ సాంకేతిక కమిటీ సభ్యుడు రవిశాస్త్రి వివరణ ఇస్తూ మరొక ఐపిఎల్ నిర్వహణ లేదా కేవలం భారత్‌లోనే క్రికెటర్లు ఆడే విధంగా చూడాలి. తద్వారా విదేశీ పెట్టుబడిదార్లను దేశానికి ఆకర్షించాలి. ఇది గిరాకీ-సరఫరా ఆట, మనం గిరాకీని సృష్టించాలి."

విశ్వగురువుగా ప్రపంచంలో నీరాజనాలు అందుకుంటున్న మన ప్రధాని నరేంద్ర మోదీ పాలన మీదే ఇన్ని జోకులా? అంటారా? అంత అవకాశం ఇప్పుడు ఎక్కడ ఇస్తున్నారు? ఇప్పుడు జోక్స్ వేయాలన్నా, షేర్ చేయాలన్నా ఎక్కడ కేసులు నమోదవుతాయో, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనన్న భయం వెంటాడుతుండడం వల్ల కావచ్చు అంతగా రావటం లేదు. పైన పేర్కొన్న జోకులన్నీ 2013లో యుపిఎ హయాంలో మన్మోహన్ సింగ్ మీద వేసినవిగా గమనించాలి. పూర్వం రాజు గారు నవ్వితే నవ్వాలి లేదా తనను నవ్వించమని అడిగితే నవ్వించాలి తప్ప ఏదీ మనంతట మనం చేయకూడదు. రాజు గారు నవ్వేంత వరకూ ఎదురు చూడాల్సిందే మరి. తొమ్మిదేండ్ల క్రితం రూపాయి మాదిరి ఇప్పుడూ ఉంది. కరోనా కాలంలో చూసిన పాత సినిమాలే మళ్ళీమళ్ళీ చూసినట్లు ఇప్పుడు పాత జోకులతోనే సరిపెట్టుకోవాలి. రోజులు బాగుంటే కొత్త జోకులు వస్తాయి.

"యుపిఎ ఏర్పడినపుడు రూపాయి-డాలరు నిష్పత్తి రాహుల్ గాంధీ వయస్సుతో సమంగా ఉంది, ఈ రోజు సోనియా గాంధీ వయస్సుకు దగ్గరగా ఉంది, మన్మోహన్ సింగ్ వయస్సును తాకుతుందేమో అన్నది మా అనుమానం" అని బీజేపీ నేత రవిశంకర ప్రసాద్ 2014కు ముందు జోక్ చేశారు. కాలం కలసి రాక ఇప్పుడు ఆ పెద్ద మనిషి రాజకీయ నిరుద్యోగిగా ఉన్నారు. లాయరు గనుక తిరిగి కోర్టులకు వెళుతున్నారో లేదో తెలియదు. చైనాతో వంద బిలియన్ డాలర్ల లావాదేవీలు జరపాలని మన్మోహన్ సింగ్ సర్కార్ నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చటంలో మన ప్రధాని నరేంద్ర మోదీ విజయం సాధించారు. తొమ్మిదేండ్ల క్రితం రవిశంకర ప్రసాద్ చెప్పినట్లు సోనియా గాంధీ వయస్సు 67 (ఇప్పుడు 75) ను దాటించారు. అదే ఊపుతో మన్మోహన్ సింగ్ వయస్సు 80 (ఇప్పుడు 89) కు చేరారు. తరవాత తన రాజకీయ గురువైన ఎల్.కె.అద్వానీ 85 (ఇప్పుడు 94) కి దక్షిణ సమర్పించినా ఆశ్చర్యం లేదు. ఇంకా ఎన్ని చిత్రాలు చూడాలో కదా!

# 'అగ్నిపథ్'కి కుల ధ్రువీకరణా?

- ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, వరుణ్ గాంధీ ధ్వజం
- రిజర్వేషన్ లేనప్పుడు దాని అవసరమేంటి: బీజేపీ మిత్రపక్షం నేత కుష్వాహా
- అవి వదంతులే: రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ:** అగ్నిపథ్ పథకం కింద సైనిక దళాల్లో నియామకం కోసం భారత సైన్యం కులాన్ని ఒక అంశంగా ఉపయోగిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ మంగళవారం ఆరోపించింది. అయితే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆ ఆరోపణలను కొట్టిపారేశారు. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడగా, జేడీ(యూ) నాయకుడు ఉపేంద్ర కుష్వాహ, బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ కూడా కుల ధృవీకరణ పత్రం అవసరమా అన్ని ప్రశ్నిస్తూ సైనిక నియామక ప్రక్రియకు సంబంధించిన పత్రాన్ని ట్వీట్ చేసి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. అయితే రాజ్‌నాథ్ సింగ్ ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. పార్లమెంటు ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఇది పుకారు అని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను. స్వాతంత్ర్యానికి ముందు అమలులో ఉన్న (నియామకం) వ్యవస్థను కొనసాగిస్తున్నారు. ఇందులో ఎలాంటి మార్పు లేదు' అని తెలిపారు. వీధి నిరసనలకు యువకులను ప్రేరేపించడానికి విమర్శకులు ప్రయత్నిస్తున్నారని అధికార బీజేపీ ఆరోపించింది. సైనిక నియామక ప్రక్రియ స్వాతంత్ర్యానికి పూర్వం నాటిదని నొక్కి చెప్పింది. ఇది 1947 తర్వాత 'ప్రత్యేక సైనిక ఆదేశం' ద్వారా అధికారీకరించడం జరిగిందని, ఆ ప్రక్రియ అదేవిధంగా ఉందని పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర చెప్పారు. 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, తమ నియామకాల్లో కులం లేదా మతం పాత్ర లేదని, పరిపాలనాపరమైన కారణాలతో దరఖాస్తుదారులను దీని గురించి అడిగారని, 2013లో సుప్రీం కోర్టులో వేసిన పిల్‌కు ప్రతిస్పందనగా సైన్యం అఫిడవిట్‌ను సమర్పించిందని పాత్రా విలేకరులతో అన్నారు. అంతకుముందు, సంజయ్ సింగ్ ఒక ట్వీట్‌లో 'భారతదేశ చరిత్రలో మొదటిసారిగా సైనిక దళాల నియామకంలో అభ్యర్థులు తమ కులాన్ని పేర్కొనాలని కోరారు. సాయుధ దళాలలో పని చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ దళితులు, వెనుకబడిన, గిరిజనులను అర్హులుగా పరిగణించలేదా' అని ప్రశ్నించారు. 'మోదీ ప్రభుత్వ చౌకబారు ముఖం దేశం ముందు బయటపడింది... మోదీ జీ, మీరు 'అగ్నివీర్' లేదా 'జాతివీర్'ని తీయాలి' అని హిందీలో చేసిన ట్వీట్‌లో ఆయన ఆరోపించారు. బీజేపీ మిత్రపక్షంగా ఉన్న కుష్వాహ్ కూడా ఈ అంశాన్ని లేవనెత్తారు. సైనిక నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించనప్పుడు అందులో కుల ధ్రువీకరణ అవసరమేంటని ప్రశ్నించారు. కాగా ఎవరైనా దేశభక్తి ఇప్పుడు అతని కులాన్ని చూసి నిర్ణయించబడుతుందా అని వరుణ్ గాంధీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

'సైన్యం ఏర్పాటు చేసిన నిబంధనలను మార్చడం ద్వారా మన జాతీయ భద్రత పై ప్రభావాన్ని ప్రభుత్వం పరిగణించాలి' అని ఆయన అన్నారు. విమర్శకులపై పదునైన దాడికి పాత్ర స్పందిస్తూ, కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష సభ్యులు తమ రాజకీయాలు చేస్తూ సైన్యాన్ని కించపరుస్తున్నారని, అవమానించారని ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులు ఎప్పటికప్పుడు సైన్యం చుట్టూ వివాదాలు సృష్టిస్తున్నారని, ఆప్ నాయకుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గతంలో కూడా పాకిస్తాన్ ఆధారిత ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని సర్జికల్, వైమానిక దాడులపై ప్రశ్నలు లేవనెత్తారని పాత్ర అన్నారు. 'భారత సైన్యం ఎప్పుడూ దరఖాస్తుదారుల కులం లేదా మతం ఆధారంగా నియామకం చేయదు. ఇది దానిపై ఉంది. ఈ విషయం ప్రజలకు తెలియదా' అని ప్రశ్నించారు. అగ్నిపథ్ పథకానికి సంబంధించిన విధాన మార్పుల అంశాన్ని లేవనెత్తడానికి తనను అనుమతించాలని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్... రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్య నాయుడును అభ్యర్థించారు. అయితే ఆయన కులం లేదా మతం గురించి నేరుగా ప్రస్తావించలేదు. రాష్ట్రీయ జనతాదళ్ ఎంపీ మనోజ్ ఝా అగ్నిపథ్ పథకం 'వినాశకరమైన చిక్కులు', రైల్వేలో వేలాది మంది ఉద్యోగ ఆకాంక్షలకు 'అవకాశాల నిరాకరణ' గురించి చర్చించడానికి వాయిదా నోటీసును సమర్పించారు.

## నూపుర్‌పై చర్యలు వద్దు

### సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ:** మహమ్మద్ ప్రవక్త పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ మాజీ నాయకురాలు నూపుర్ శర్మపై ఈ ఏడాది ఆగస్టు 10వ తేదీ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశించింది. ఈ ఏడాది మే 26న జరిగిన ఒక టీవీ చర్చా కార్యక్రమంలో ప్రవక్త పై ఆమె చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీంతో అనేక రాష్ట్రాల్లో తనపై నమోదయిన ఎఫ్‌ఐఆర్‌లు, ఫిర్యాదులకు సంబంధించిన 9 పిటిషన్లను కలిపి విచారణ చేయాలని, తన అరెస్టుపై స్టే విధించాలని నూపుర్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, పార్దివాలతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ చేసింది. జులై 1 ఆదేశాల తర్వాత, నుపుర్ శర్మకు ప్రాణహాని కలిగిస్తామన్న బెదిరింపులను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఎఫ్‌ఐఆర్‌లు, ఫిర్యాదుల్లో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేసింది. తనపై నమోదయిన ఎఫ్‌ఐఆర్‌లపై ఉపశమనం పొందేందుకు సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని సుప్రీం కోర్టు జులై 1న ఆదేశించింది. అయితే ఆ తర్వాత చోటు చేసుకొన్న పరిణామాలను ఉన్నత న్యాయస్థానంలో నూపుర్ న్యాయవాది వివరించారు. అజ్మీర్ దర్గాకు చెందిన ఖాదీమ్‌తో పాటు మరికొందరు నూపుర్ శర్మను బెదిరించారని చెప్పారు. దీంతో ప్రాణాలకు తెగించి ఆయా రాష్ట్రాలకు వెళ్లడం సాధ్యం కాదని ఆమె తరపు న్యాయవాది మణిందర్ సింగ్ చెప్పారు. దీంతో ఉన్నత న్యాయస్థానం ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రతో సహా అనేక రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. ఆగస్టు 10 లోగా వారి ప్రతిస్పందనలను కోరింది. తొలుత ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన ఢిల్లీలోనే అన్ని ఎఫ్‌ఐఆర్‌లను ఎందుకు కలపకూడదని ప్రశ్నించింది. తదుపరి విచారణను ఆగస్టు 10కి వాయిదా వేసింది. కాగా జులై 1న ఇదే ధర్మాసనం, ప్రవక్తపై ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నూపుర్ శర్మను తీవ్రంగా తప్పుబట్టింది. ఆమె వ్యాఖ్యలు మొత్తం దేశానికి నిప్పు పెట్టాయని, దేశంలో జరుగుతున్న దానికి ఆమె ఒక్కరిదే బాధ్యత అని హెచ్చరించింది.

## వరవరరావు బెయిల్ పిటిషన్‌పై

### ఆగస్టు 10న పూర్తి స్థాయి విచారణ : సుప్రీం

**న్యూఢిల్లీ:** ప్రముఖ రచయిత, విరసం నేత వరవరరావు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన మెడికల్ బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. మంగళవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ రవీంద్ర భట్, సుధాన్షు ధులియాల ధర్మాసనం విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ వీఎస్ రాజు తనవాదనలు వినిపిస్తూ వరవరరావు ఇప్పటికే మెడికల్‌పై ఉన్నారని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఆగస్టు 10న తదుపరి విచారణ పూర్తి స్థాయిలో చేపడతామని, అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 2 లోపు తెలపాలని. ఆగస్టు 8 లోపు రీజాయిండర్ దాఖలు చేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై తుది విచారణను ఆగస్టు 10న చేపట్టనున్నట్లు పేర్కొంది. వరవరరావుకు మంజూరైన బెయిల్ ఈ నెల 12తో ముగిసినా ఆయన లొంగిపోవాల్సిన పని లేదని, ఆగస్టు 10వ తేదీ వరకూ యదాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. భీమా కోరేగావ్ కేసులో నిందితుడిగా వరవరరావును మహారాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## ఢిల్లీకి రాష్ట్రపతి ఎన్నిక బ్యాలెట్ బాక్స్‌లు

**న్యూఢిల్లీ:** రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో జరిగిన రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు ఢిల్లీకి చేరుకుంటున్నాయి. సోమవారం పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే దేశ రాజధానికి బ్యాలెట్ బాక్సుల తరలింపు ప్రారంభమైంది. ఢిల్లీ శాసనసభ నుంచి బ్యాలెట్ బాక్స్ సోమవారం అర్ధరాత్రి స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకోగా, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, అసోం, రాజస్థాన్ ల నుంచి బ్యాలెట్ బాక్సులను ప్రత్యేక వాణిజ్య విమానాల ద్వారా ఇక్కడికి తీసుకువచ్చారు. సదరు రాష్ట్రాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారు(ఏఆర్ఓలు)లు రక్షిత విమానంలో బ్యాలెట్ బాక్స్ లను రాజధానికి తరలించారు. ఈ మేరకు ఎన్నికల సంఘం... విమానాల్లో సంబంధిత ఏఆర్ఓలు, సీల్ చేసిన బ్యాలెట్ బాక్సుల ఛాయాచిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. ఢిల్లీకి నేరుగా తెల్లవారుజామున విమాన సర్వీసులు ఉండే రాష్ట్ర రాజధానుల నుంచి బ్యాలెట్ బాక్సులు మంగళవారం మధ్యాహ్నానికి ఇక్కడికి చేరుకుంటాయని ఎన్నికల సంఘం అధికారి వెల్లడించారు. ఇక నేరుగా విమానాలు లేని రాష్ట్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు మంగళవారం సాయంత్రానికి చేరుకుంటాయి.

హిమాచల్ ప్రదేశ్ నుంచి బ్యాలెట్ బాక్సులను రోడ్డు మార్గంలో తీసుకొచ్చే అవకాశం ఉంది. ప్రతి బ్యాలెట్ బాక్స్‌కు 'మిస్టర్ బ్యాలెట్ బాక్స్' పేరుతో ఇ-టికెట్ జారీ చేయబడుతుంది. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్లమెంట్ హౌస్‌తోపాటు 31 స్థానాలు, రాష్ట్ర శాసనసభల పరిధిలోని 30 కేంద్రాల్లో పోలింగ్ జరిగిందని ఎన్నికల సంఘం తెలిపింది. జులై 21 ఓట్ల లెక్కింపు జరగనుంది.

## కొత్తగా 39 కో-ఆపరేటివ్ సొసైటీలు

### హోంమంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ:** 2021 జులైలో ఏర్పాటైన ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖ పరిధిలో నూతనంగా 39 కొత్త బహుళ రాష్ట్ర సహకార సంఘాలు (కో-ఆపరేటివ్ సొసైటీలు) రిజిస్టర్ అయ్యాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం తెలిపారు. లోక్‌సభలో ఎదురైన ప్రశ్నకు స్పందించిన ఆయన ఈ మేరకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. మంత్రిత్వ శాఖ ఏర్పాటైన తరువాత దేశ వ్యాప్తంగా జూన్ 30 నాటికి కొత్తగా 39 కోఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటయ్యాయని, అందులో అత్యధికంగా మహారాష్ట్రలో 17 ఉన్నాయని తెలిపారు. ఇక యూపీలో-5, కేరళలో-4, గుజరాత్‌లో-3, న్యూఢిల్లీ, మణిపూర్ రాష్ట్రాల్లో రెండు చొప్పున ఏర్పాటవగా హరియాణా, జమ్మూ కాశ్మీర్, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటైనట్టు తెలిపారు. ఇవన్నీ మల్టీ-స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద ఏర్పాటైనట్టు పేర్కొన్నారు. వీటితో కలపి జూన్ 30 నాటికి దేశంలో మొత్తం 1,508 మల్టీస్టేట్ కో ఆపరేటివ్ సొసైటీలున్నట్టు ఇందులో 81 సంస్థలు లిక్విడేషన్‌లో ఉన్నాయని తెలిపారు. లిక్విడేషన్‌లో ఉన్నవాటిని మూసివేసే చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సహకార సంఘాల్లో అవినీతి అవకతవకలపై ఎప్పటికప్పుడు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. మరోవైపు సహకార సంఘాలను ఆర్థికంగా పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టినట్టు వివరించారు.

## డీఎస్పీని హతమార్చిన మైనింగ్ మాఫియా

### హరియాణాలో దారుణం: నిందితుడి అరెస్టు

**గురుగ్రామ్:** హరియాణాలో ఘోరం జరిగింది. అక్రమ తవ్వరాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఓ పోలీసు ఉన్నతాధికారిపై అక్కడి మైనింగ్ మాఫియా దాడి చేసింది. ట్రక్‌తో దాడిచేసి దారుణంగా హతమార్చింది. ఆరావళి పర్వత ప్రాంతంలో జరిగిన ఈ దాడి ఘటన అక్కడి పోలీసు శాఖను దిగ్భ్రాంతికి గురిచేసింది. హరియాణాలోని పచగావ్‌కు సమీపంలో అక్రమంగా రాయి తవ్వకాలు కొనసాగుతున్నట్లు కొంతకాలంగా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో తావ్‌డూకు చెందిన డీఎస్పీ సురేంద్ర సింగ్...తన బృందంతో కలిసి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లారు. ఈ బృందాన్ని చూసిన వెంటనే అక్రమ మైనింగ్ చేస్తున్న వారంతా పారిపోవడం ప్రారంభించారు. అదేసమయంలో రాళ్లను తరలిస్తున్న ట్రక్కును ఆపాలని డీఎస్పీ సురేంద్రసింగ్ ఆదేశించారు. డీఎస్పీ ఆదేశాలను ఏమాత్రం ఖాతరు చేయని ట్రక్కు డ్రైవర్ వేగంగా పోలీసు అధికారంపై వాహనం ఎక్కించాడు. ఈ దాడిలో డీఎస్పీ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు పోలీసులు ఈ దాడి నుంచి తప్పించుకున్నారు. దాడి అనంతరం నిందితుడు పారిపోగా అతడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు. కాగా ఆరావళి ప్రాంతంలో అక్రమ మైనింగ్‌పై 2009లోనే సుప్రీంకోర్టు నిషేధం విధించింది. అయినా అక్రమ తవ్వకాలను మాఫియా కొనసాగిస్తోంది. దీనిని అరికట్టడానికి వెళ్లిన పోలీసు ఉన్నతాధికారి మైనింగ్ మాఫియా చేతిలో హతమయ్యారు. కాగా, డీఎస్పీ సురేంద్రసింగ్‌పై ట్రక్కు ఎక్కించి హతమార్చిన డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీనికిముందు తప్పించుకునేందుకు ప్రయత్నించిన డ్రైవర్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. దీంతో డ్రైవర్ మోకాలికి బుల్లెట్ గాయమైంది. నిందితుడిని ఇక్కర్‌గా గుర్తించారు. ఎన్‌కౌంటర్ తర్వాత నిందితుడిని పోలీసులు పట్టుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. నిందితుడిని ఆసుపత్రికి తరలించారు.

## పవార్ శివసేనను విచ్ఛిన్నం చేస్తున్నారు

### సేన బహిష్కృత నేత రాందాస్ కదమ్

**ముంబై:** ఎన్సీపీ అధినేత శరద్ పవార్ శివసేనను విచ్ఛిన్నం చేస్తున్నారని మహారాష్ట్ర మాజీ మంత్రి రాందాస్ కదమ్ ఆరోపించారు. దీనికి రుజువును శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేకు అందజేసినట్లు కూడా ఆయన చెప్పారు. కదమ్ ఓ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ... పవార్ వల్ల శివసేన క్రమబద్ధంగా బలహీనపడింది. కొంతమంది ఎమ్మెల్యేలు దీనిపై ఆందోళన వ్యక్తం చేసినా పవార్‌తో విడిపోవడానికి ఠాక్రే సిద్ధంగా లేరని కదమ్ పేర్కొన్నారు. శివసేనపై శరద్ పవార్ ఎలా విరుచుకుపడుతున్నారో ఉద్ధవ్‌జీకి తాను తగిన ఆధారాలు ఇచ్చానని కదమ్ పేర్కొన్నారు. అయితే ఎన్సీపీ ముఖ్య అధికార ప్రతినిధి మహేశ్ తపసే... కదమ్ వ్యాఖ్యలను తోసిపుచ్చారు. శివసేనలో చీలిక వెనుక బీజేపీ హస్తం ఉందని, పవార్‌ను లక్ష్యంగా చేసుకుని దాని నుంచి దృష్టి మరల్చేందుకు తిరుగుబాటు నేతలు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. పవార్ చొరవ వల్లే ఎంవీఏ ఏర్పడిందని, తిరుగుబాటు తర్వాత కూడా ఉద్ధవ్ ఠాక్రేకు, ఆయన నేతృత్వంలోని పార్టీకి ఎన్సీపీ మద్దతు ఇస్తోందని తపసే పేర్కొన్నారు. కదమ్ సోమవారం పార్టీ పదవికి రాజీనామా చేస్తూ ఠాక్రేకు లేఖ రాశారు. కాగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు కదమ్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే సోమవారం సాయంత్రం ప్రకటించారు. అయితే ఆ తరువాత కదమ్‌ను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని సేన తిరుగుబాటు వర్గం... పార్టీ నాయకుడిగా కదమ్‌ను పునర్నియమించింది.

గత నెలలో షిండే, 39 మంది ఇతర సేన ఎమ్మెల్యేలు పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడంతో ఠాక్రే నేతృత్వంలోని సేన, ఎన్సీపీ, కాంగ్రెస్‌లతో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం కూలిపోయిన సంగతి తెలిసిందే. షిండే పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినప్పుడు, రత్నగిరి జిల్లాలో దాపోలి నుండి ఎమ్మెల్యే గా ఎన్నికైన రాందాస్ కదమ్ కుమారుడు యోగేష్ కదమ్ కూడా తిరుగుబాటు శిబిరంలో చేరారు.

## వ్యవసాయ చట్టాల పునరుద్ధరణకు కుట్ర

### కేంద్రంపై రైతు నాయకుల విమర్శ

**చండీగఢ్:** కేంద్రంలోని మోదీ సర్కారు రద్దు చేసిన వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన మళ్లీ తీసుకురావాలని చూస్తోందని పంజాబ్, హరియాణాకు చెందిన రైతుల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కనీస మద్దతుధర (ఎంఎస్‌పీ)పై కేంద్రం ఇటీవల ఏర్పాటు చేసిన కమిటీ కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనని విమర్శించారు. సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించే మార్గాలు, పంటల వైవిధ్యం వంటి ఇతర అంశాలను పక్కన పెట్టి కేంద్ర కమిటీని కేవలం ఎంఎస్‌పి సమస్యకు మాత్రమే పరిమితం చేయాలని రైతు నాయకులు కోరుతున్నారు. భారతీయ కిసాన్ యూనియన్-డకౌండా నాయకుడు మంజిత్ సింగ్ ధనేర్ మాట్లాడుతూ... ప్రభుత్వం కేవలం లాంఛనప్రాయంగానే కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. 'ఈ కమిటీని ఏర్పాటు చేయడం కేవలం లాంఛనప్రాయమే... ఎంఎస్‌పీకి చట్టబద్ధ హామీ కోసం మా పోరాటం కొనసాగుతుంది. ఈ సమస్యపైనే ప్రత్యేక కమిటీ కావాలనేది మా డిమాండ్' అని ఆయన అన్నారు. కమిటీలో ఉన్న కొందరు సభ్యులు గతంలో మూడు వ్యవసాయ చట్టాలకు మద్దతు ఇచ్చారని ధనేర్ పేర్కొన్నారు. 'ప్రభుత్వం దొడ్డిదారిలో వ్యవసాయ చట్టాలను తిరిగి తీసుకురావాలని కోరుకుంటున్నట్లు కనిపిస్తోంది' అని ఆయన అన్నారు. హరియాణా బీకేయూ(చాదుని) చీఫ్ గుర్నామ్ సింగ్ చాదునీ మాట్లాడుతూ... రైతులు ఎంఎస్‌పీపై కమిటీని కోరారని చెప్పారు. ఈ సమస్యను పలుచన చేయడానికి పంటల వైవిధ్యం మొదలైన అనేక అంశాలు చేర్చారని తెలిపారు. వ్యవసాయ చట్టాలను బహిరంగంగా సమర్థించిన వ్యక్తులు కమిటీలో ఉన్నారన్న ధనేర్ వ్యాఖ్యలను పునరుద్ఘాటించారు. ప్రభుత్వం మళ్లీ వ్యవసాయ చట్టాలను తీసుకురావాలని చూస్తున్నందున ఈ కమిటీని తాము బహిష్కరిస్తామని చాదుని చెప్పారు. రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ కమిటీ... వ్యవసాయంపై బీజేపీ ద్వేషం, హ్రస్వదృష్టికి తాజా ఉదాహరణ అన్నారు. పంజాబ్ సంస్థలను, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులను కమిటీ నుంచి మినహాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

## 'లోదుస్తుల తొలగింపు'పై దుమారం

- దురుద్దేశంతోనే ఫిర్యాదు: ఎన్‌టీఏ
- కేంద్రం జోక్యం కోరిన కేరళ
- నీట్ నిర్వహణ సంస్థపై చర్యలకు డిమాండు
- పార్లమెంటులో ప్రస్తావన: సమగ్ర విచారణకు కేంద్రం ఆదేశం
- 15 రోజుల్లో నివేదిక ఇవ్వండి: కొల్లం ఎస్పీకి రాష్ట్రమానవహక్కుల సంఘం సూచన
- కాలేజీ వద్ద ఉద్రిక్తత - లాఠీచార్జి

**న్యూఢిల్లీ / తిరువనంతపురం:** కేరళలో నీట్ పరీక్ష నిమిత్తం పరీక్షా కేంద్రంలోకి వెళ్లేముందు నిర్వహించే తనిఖీల్లో భాగంగా లోదుస్తులు విప్పాలని సిబ్బంది బలవంతం చేసినట్లు కొందరు విద్యార్థినులు చేసిన ఆరోపణలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. ఈ ఘటనకు కారకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండు మిన్నంటింది. నీట్ నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మాత్రం ఇదంతా అవాస్తవం-బూటకం అని కొట్టిపారేసింది. దురుద్దేశంతో చేసిన ఫిర్యాదుగా అభివర్ణించింది. బాలిక తరపు ఫిర్యాదు దురుద్దేశంతో చేసినదనిగా కొల్లంలోని నీట్ పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ తెలిపినట్లు పేర్కొంది. అలాంటి ఘటనే చోటుచేసుకోలేదని ఆయనన్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. కేరళ విద్యాశాఖ మంత్రి ఆర్ బిందు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశారు. ఎన్‌టీఏపై చర్యలకు డిమాండు చేశారు. 'ఇది అవమానకరం. విద్యార్థినుల గౌరవమర్యాదలను కించపరిచే చర్య ఆక్షేపణీయం. ఈ అమానవీయ ఘటన విద్యార్థినుల నైతిక స్థైర్యాన్ని, ఏకాగ్రతను దెబ్బ తీసింది. ఆటవిక చర్యకు బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి' అని ఆ లేఖలో డిమాండు చేశారు. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని, వెంటనే జోక్యం చేసుకొని తగు చర్యలు తీసుకోవాలని ప్రధాన్‌ను కోరారు. తొలిసారి పరీక్షకు హాజరైన తన 17 ఏళ్ల కుమార్తె పరీక్షా కేంద్రంలో పడిన అవస్థలను ఓ తండ్రి వెల్లడించడంతో ఈ వ్యవహారం సోమవారం వెలుగులోకి వచ్చింది. బాలిక తండ్రి మీడియాతో మాట్లాడారు. వస్త్రధారణ నీట్ బులెటిన్ ప్రకారమే ఉన్నప్పటికీ ఆమెను ఇలా అవమానించడంతో తల్లడిల్లిపోయిందని అన్నారు. బాలిక, ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేరళ పోలీసులు ఐపీసీలోని 354, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై కేరళ విద్యార్థి-యువజన సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. బాధ్యులపై చర్యలను డిమాండు చేస్తూ మారథోమ కాలేజీ వద్దకు చేరుకొని విద్యార్థులు విధ్వంసం సృష్టించారు. లోపలికి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. దీంతో వారిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జి చేయగా కొందరు గాయపడ్డారు. రాష్ట్రంలోని మరికొన్ని చోట్ల నిరసనలు జరిగాయి. ఈ వ్యవహారంపై మానవహక్కుల సంఘం స్పందిస్తూ 15 రోజుల్లోగా నివేదికను సమర్పించాలని కొల్లాం రూరల్ ఎస్పీని ఆదేశించింది. ఈ వ్యవహారం పార్లమెంటు వరకు వెళ్లింది. కేరళ ఎంపీ ప్రేమచంద్రన్ ఈ ఘటనపై చర్చను కోరుతూ నోటీసు ఇచ్చారు.

## రేపు పార్లమెంటు ముందు బ్యాంకు ఉద్యోగుల ధర్నా

### కేంద్ర కార్మిక సంఘాల మద్దతు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక (యూఎఫ్‌బీయూ) ఈ నెల 21న పార్లమెంట్ ముందు సామూహిక ధర్నా నిర్వహించనున్నది. ఈ ధర్నా కార్యక్రమానికి కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, టీయూసీసీ,ఎస్ఎడబ్ల్యూ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ సంఘాలు, ఇతర స్వతంత్ర కార్మిక సంఘాల సమాఖ్యలతో కూడిన ఐక్యవేదిక ఒక సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యూఎఫ్‌బీయూ సుదీర్ఘ కాలంగా అలుపెరుగని పోరాటం చేస్తోందని, బ్యాంకుల ఉద్యోగులు, ఆఫీసర్లు చేస్తున్న పోరాటానికి కేంద్ర కార్మికసంఘాల ఐక్యవేదిక ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తున్నదని ప్రకటన పేర్కొంది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం నిరంతర ప్రయత్నాలు చేస్తోందని, ప్రైవేటు బ్యాంకులను ప్రోత్సహిస్తోందని యూఎఫ్‌బీయూ విమర్శించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంకా అనేక ఇతర విభాగాలు, వ్యవస్థలను కూడా ప్రైవేటీకరించేందుకు చేస్తున్న కుట్రలను యూఎఫ్‌బీయూ తన అవిశ్రాంత పోరాటాల క్రమంలో వెలికితీసిం దని పేర్కొంది. ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు రైల్వేలు, బొగ్గుగనులు, విమానాశ్రయాలు, రక్షణరంగం, పిఎస్‌యూలు వంటి ఎన్నో వ్యవస్థలను ప్రైవేట్‌పరంచేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని పేర్కొంది. ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయత్నాలు విరామం లేకుండా కొనసాగుతున్నాయని, ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులను శరవేగంగా ప్రభుత్వ పరిధి నుండి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఐక్యవేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం నియమిస్తున్న వివిధ రకాల కమిటీలు కూడా ప్రైవేటీకరణ ఒక్కటే మార్గం అంటూ కార్మిక వ్యతిరేక విధానాలను, ఉద్యోగ, కార్మిక అభద్ర సృష్టించే వైఖరులను సమర్థిస్తూ తూచా తప్పకుండా ఒకే విధమైన నివేదికలు ఇస్తున్నాయని, ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను వీలైనంత త్వరగా కూల్చివేసి ప్రైవేటీకరించే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్స్ రీసెర్చ్‌కి చెందిన పూనంగుప్తా, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అరవింద్ పనగారియా ఇటీవల సమర్పించిన నివేదిక యావత్ ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను ప్రైవేటీకరించాల్సిందేనని స్పష్టం చేయడంపై కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రభుత్వరంగ బ్యాంకులు ఎంతో కీలకపాత్ర వహిస్తున్నాయని, ఆర్థిక వ్యవస్థ విస్తృతికి, అభివృద్ధికి, పథకాల అమలులోనూ, రుణమేళా కార్యక్రమాల ద్వారా కొనగోలు శక్తి, ఆర్థిక కార్యకలాపాల ఉధృతికి ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని గుర్తు చేసింది.

## లులూ మాల్‌లో నమాజ్ వీడియో వైరల్

### యూపీలో నలుగురి అరెస్టు

**లక్నో:** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో కొత్తగా ప్రారంభమైన లులూ మాల్‌లో నమాజ్ చేసిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మాల్‌లో అనధికారికంగా నమాజ్ చేస్తున్నట్టు ఒక వీడియో వైరల్ అవడంతో హిందుత్వ సంస్థలు దుమారాన్ని లేపాయి. తాము హనుమాన్ చాలీసా పఠించడానికి అనుమతివ్వాలని కోరిన నేపథ్యంలో పోలీసులు స్పందించారు. మాల్‌లో నమాజ్ చేస్తున్న వారిలో నలుగురిని గుర్తించి మంగళవారం అరెస్టు చేసినట్లు లక్నో పోలీసు కమిషనర్ డీకే ఠాకూర్ తెలిపారు. మరో నలుగురి ఆచూకీ కోసం అన్వేషిస్తున్నట్టు పేర్కొన్నారు. నమాజ్ చేసినవారు ఎవరూ మాల్‌లో పని చేసే సిబ్బంది కాదని పేర్కొన్నారు.

పట్టుబడిన వారిని లక్నోకు చెందిన మహమ్మద్ రెహాన్, అతిఫ్ ఖాన్, మహమ్మద్ లోక్‌మాన్, మహమ్మద్ నోమన్‌లుగా గుర్తించినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా నమాజ్ చేసిన వారు ఇక్కడ పని చేస్తున్నవారు కాదని, తమ మాల్‌లో పని చేస్తున్నవారిలో 80 శాతం మంది హిందువులేనని యాజమాన్యం వివరణ ఇచ్చింది.

# గోదావరి వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్**

విశాలాంధ్ర –కళ్యాణదుర్గం: రాష్ట్రంలో వరద బీభత్సం కొనసాగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధినేతలకు చీమకుట్టినట్లు లేదని, వరద బాధితులను ఆదుకోవడంలో ఘోర వైఫల్యం చెందారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామ కృష్ణ విమర్శించారు. గోదావరి వరదని జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బాధితులను ఆదుకోవడానికి ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని సూచించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో మంగళవారం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసుతో కలిసి రామ కృష్ణ మీడియాతో మాట్లాడారు. గోదావరికి వరద వచ్చి 550 గ్రామాలు నీట మునిగితే రెవెన్యూ యంత్రాంగం నిద్రమత్తులో జోగుతోందని రామకృష్ణ మండిపడ్డారు. సీఎం జగన్ ఏరియల్ సర్వేకే పరిమితమయ్యారని, క్షేత్రస్థాయిలో బాధితులను కలిసి ఓదార్పు ఇవ్వలేకపోయారని ఆరోపించారు. రెండు పూటలా భోజనం లేక పిల్లలు, మహిళలు, వృద్ధులు అల్లాడుతున్నారని, పిల్లలకు కనీసం పాల ప్యాకెట్లు కూడా ఇవ్వలేకపోయారని చెప్పారు. వరద బాధితులను యుద్ధ ప్రాతిపదిక ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మానవ తప్పిదం వల్లనే గోదావరికి వరద ఉధృతి పెరిగిందన్నారు. రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలకు పెంచిన సీఎం జగన్...అందుకు తగ్గట్టుగా పరిపాలన సాగించడం లేదని ఆరోపించారు. ప్రజా సంపదను కొల్లగొడుతున్న మోదీ, జగన్... ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని జగన్ తన సొంత పేరుతో పథకం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది ముమ్మాటికీ రాజ్యాంగాన్ని అవమానపరచడమేనన్నారు. దేశ ప్రజలు, గత పాలకులు సృష్టించిన ప్రజా సంపదనంతా మోదీ సర్కారు కార్పొరేట్ రంగానికి ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. జగన్ తన సొంత ప్రయోజనాల కోసం మోదీ విధానాలను గుడ్డిగా సమర్థిస్తున్నారని, రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతివ్వడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అనంతపురం జిల్లాలో వేరుశనగ పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం, పంటల బీమా అందించాలని డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులకు కృష్ణా జలాలు తీసుకురావాల్సిన మంత్రి...తన అనుచరులు, కుటుంబ సభ్యులతో ఆ చెరువులనే కబ్జా చేయిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేయాలని జగన్‌ను నిలదీస్తామని రామకృష్ణ హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, జిల్లా నాయకులు సంజీవప్ప, రాజారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ధరలపై నిరసన జ్వాల

- పార్లమెంటు కాంప్లెక్స్‌లో కాంగ్రెస్ ధర్నా
- విపక్షాల సంఘీభావం
- చర్చకు భయపడుతున్న మోదీ సర్కారు
- జీఎస్‌టీ పెంపుతో సామాన్యులకు ఆహారం దూరం
- మోదీ సర్కారుపై ఎంపీల ఆగ్రహం

న్యూదిల్లీ: ధరల పెరుగుదలపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. నిత్యావసర వస్తువులు, వంటగ్యాస్ ధరల పెంపునకు నిరసనగా పార్లమెంటు కాంప్లెక్స్‌లో మంగళవారం ధర్నాకు దిగింది. పాలు, పెరుగు వంటి ప్యాకేజ్డ్ ఆహార వస్తువులపై జీఎస్‌టీ పెంచడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, వంట నూనెలు, ఎల్‌పీజీ సహా అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, మోదీ పాలనలో సామాన్యులే కాకుండా మధ్యతరగతి ప్రజలు సైతం జీవించే అవకాశం లేకుండా పోయిందని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సహా కొంతమంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సుప్రియా సూలె (ఎన్‌సీపీ), రామ్‌గోపాల్ యాదవ్(ఎస్‌పీ), ప్రియాంక చతుర్వేది(శివసేన) ధర్నాలో పాల్గొన్నారు. పార్లమెంటు కాంప్లెక్స్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ధర్నా జరిగింది. మోదీ సర్కారుకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. వంట గ్యాస్ ధర తగ్గించాలని కాంగ్రెస్ సహా ఇతర పార్టీల ఎంపీలు డిమాండ్ చేశారు. ద్రవ్యోల్బణం పెరుగుదల, సామాన్యులపై భారం పడేలా నిత్యం ధరలు పెంచడం వంటి అంశాలపై బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. లోక్‌సభ, రాజ్యసభకు చెందిన కాంగ్రెస్ ఎంపీలంతా ధర్నాలో పాల్గొన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జునఖర్గె, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి హాజరయ్యారు. రోజువారీ ఉపయోగించే పెరుగు, పన్నీరు, ఇతర నిత్యావసర వస్తువులపై ఐదుశాతం జీఎస్‌టీ విధించడం సామాన్యులను ఇబ్బందులకు గురిచేయడమేనని ఖర్గె విమర్శించారు. పార్లమెంటు లోపలా తాము నిరసన తెలుపుతామని వెల్లడించారు. ధరల పెరుగుదల, జీఎస్‌టీపై చర్చించాలని ప్రతిపక్షాలన్నీ డిమాండ్ చేస్తున్నాయని, కానీ ప్రభుత్వం అందుకు ముందుకు రావడం లేదని లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మాణిక్యం ఠాగూర్ విమర్శించారు. ధరలపై చర్చ కోసం డిమాండ్ చేస్తే స్పీకర్ సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారని మండిపడ్డారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా ధరల పెరుగుదలపై తాము చర్చకు పట్టుబడతామని స్పష్టంచేశారు. చర్చకు ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ఆయన ప్రశ్నించారు.

# బోగస్ కమిటీ.. అక్కర్లేదు

- ప్రభుత్వ ఎంఎస్పీ ప్యానల్‌కు ఎస్‌కేఎం తిరస్కృతి
- కార్పొరేట్ వ్యక్తులకు సభ్యత్వం
- అస్పష్ట అజెండాపై అభ్యంతరం

న్యూదిల్లీ: కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన దాదాపు ఎనిమిది నెలల తర్వాత ఓ కమిటీని అందుకోసం కేంద్రం ఏర్పాటు చేసింది. అయితే ఈ కమిటీలోని సభ్యులు, దాని అజెండాలోని అంశాలపై సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ కమిటీ బోగస్ అని.. రైతుల న్యాయబద్ధ హక్కులకు హామీనిచ్చేదిగా లేదని పేర్కొంది. ఈ కమిటీపై తమకు నమ్మకం లేదని, దానిని తిరస్కరిస్తున్నామని మంగళవారం ప్రకటించింది.

ప్రస్తుతం రద్దు అయిన మూడు వివాదాస్పద సాగు చట్టాలకు అప్పట్లో మద్దతు ఇచ్చిన 'రైతు నేతలు' కమిటీలో ఉండటాన్ని ఎస్‌కేఎం తప్పుపట్టింది. పంజాబ్‌కు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని గర్హించింది. ఇలాంటి ప్యానల్ తమకు అక్కర్లేదని ఎస్‌కేఎం సీనియర్ నేత దర్శన్ పాల్ తేల్చిచెప్పారు. ఇది బోగస్ కమిటీ, రైతులకు చట్టబద్ధమైన హక్కుల కల్పనకు దోహదం చేసేదిగా లేదు, అందుకే తిరస్కరించామన్నారు. ఈనెల 3వ తేదీన ఎస్‌కేఎం నేతలు సమావేశమై ప్రభుత్వ కమిటీ అజెండాలోని అంశాలన్నీ స్పష్టంగా ఉంటేగనుక ప్యానల్ కోసం కొన్ని పేర్లను ప్రతిపాదించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కానీ అందుకు భిన్నంగా ప్యానల్ ఏర్పాటు జరగడాన్ని దుయ్యపట్టారు.

మరొక రైతు నేత అభిమన్యు కోహర్ మాట్లాడుతూ,'సంయుక్త కిసాన్ మోర్చాకు చెందిన రాజకీయేతర నేతలు మంగళవారం భేటీ అయి ప్రభుత్వ ప్యానల్‌ను తిరస్కరించారు. దిల్లీ సరిహద్దుల్లో ఏడాదికిపైగా సాగిన సాగు చట్టాల వ్యతిరేక ఉద్యమంలో ఏ మాత్రం భాగస్వామ్యం లేని రైతు నేతలుగా చెప్పుకునే వారికి, కార్పొరేట్ వ్యక్తులకు ఈ ప్యానల్‌లో స్థానం కల్పించారు. ఇలాంటి ప్యానల్‌ను రైతులు నమ్మేపరిస్థితి లేదు' అని అన్నారు.

కాగా, వ్యవసాయ శాఖ మాజీ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ నేతృత్వంలో ఈ కమిటీ ఏర్పాటు అయింది. దీనికి సంబంధించి కేంద్ర వ్యవసాయ శాఖ ఈ నెల 12న రహస్య నోటిఫికేషన్ జారీ చేయడం, ఆ విషయాన్ని ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సమయంలో ప్రకటించడం చర్చనీయాంశమైంది.

ఈ కమిటీలో నీతిఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్, వ్యవసాయ నిపుణుడు-ఆర్థికవేత్త సీఎస్‌సీ శేఖర్, ఐఐఎం అహ్మదాబాద్‌కు చెందిన సుఖ్‌పాల్ సింగ్, సీఏసీపీకి చెందిన నవీన్ సింగ్ ఉన్నారు. రైతుల ప్రతినిధులుగా జాతీయ అవార్డు పొందిన రైతు భారత్ భూషణ్ త్యాగితో పాటు ఎస్‌కేఎం నుంచి ముగ్గురు, ఇతర రైతుల సంఘాల నుంచి ఐదుగురు, ఐఎఫ్‌ఎఫ్‌సీఓ చైర్మన్ దిలీప్ సంఘానీ, సీఎన్‌ఆర్‌ఐ ప్రధాన కార్యదర్శి బినోద్ ఆనంద్ ఉన్నారు. అలాగే, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, సిక్కిం, ఒడిశా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కేంద్రప్రభుత్వ కార్యదర్శులు ఐదుగురు, వ్యవసాయ యూనివర్సిటీలకు చెందిన కొందరు సీనియర్లు కూడా సభ్యుల్లో ఉన్నారు.

## ఆ 19 మంది కూలీల్లో ఒకరి మృతి

- నదిలో మృతదేహం లభ్యం
- కాంట్రాక్టరు సెలవు ఇవ్వకపోవడంతో అంతా పరార్

ఇటానగర్: ఈద్ సందర్భంగా సెలవు ఇచ్చేందుకు కాంట్రాక్టరు నిరాకరించడంతో భారత్-చైనా సరిహద్దు వెంబడి దామిన్-హురి రోడ్డు నిర్మాణ పనుల్లో ఉన్న 19 మంది కూలీలు అక్కడ నుంచి పరారయ్యారు. అయితే వారిలో ఒకరు మృత్యువాత పడ్డారు. ఆచూకీ లేని 19 మంది కూలీల్లో ఒకరి మృతదేహం అరుణాచల్ ప్రదేశ్, కురుంగ్ కుమే జిల్లాలోని నదిలో లభ్యమైనట్లు ఓ అధికారి మంగళ వారం తెలిపారు. కూలీలంతా అసోంకు చెందిన వారు కాగా స్వస్థలా నికి వెళ్లేందుకు అడవి గుండా వేరొక మార్గాన్ని ఎంచుకొన్న క్రమంలో వారిలో ఒకరు ప్రమాదవశాత్తు కుమే నదిలో పడిపోయి ఉండవచ్చు అని కురుంగ్ కుమే డిప్యూటీ కమిషనర్ నిఘీ బెంగియా తెలిపారు. నదిలో 16 మృతదేహాలు తేలినట్లు వైరల్ అయిన ఆడియో క్లిప్‌ను ఆయన తోసిపుచ్చారు. ఇప్పటివరకు ఒక మృతదేహమే తమకు లభ్యమైందని అన్నారు. ప్రాజెక్టు స్థలి దామిన్ సర్కిల్‌లో ఉందని, ఇది కొలోరియాంగ్‌కు 200కిమీల దూరమని, అక్కడకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించాలని, కూలీలు మునిగిపోయారా అన్నది ఆరా తీయాలని సర్కిల్ అధికారికి సూచించినట్లు బెంగియా తెలిపారు.

## చర్చ నుంచి ప్రభుత్వం పారిపోతోంది: రాహుల్

న్యూదిల్లీ: ధరల పెరుగుదల, జీఎస్‌టీ రేట్ల పెంపు, రూపాయి విలువ క్షీణతపై మోదీ సర్కారును కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ దుదు మాడారు. ధరల పెరుగుదలపై ప్రతిపక్షాల ప్రశ్నలకు, పార్లమెంటులో చర్చ నుంచి పారిపోవడంపై ప్రధాని సమాధానం చెప్పకపోవడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి విరుద్ధమని రాహుల్ విమర్శించారు. అనేక పదాలను అన్‌పార్లమెంటరీగా ప్రకటించడంపై ప్రతిపక్షాల ప్రశ్నలకు ప్రధాని మౌనం వహించడం ఏమిటని నిలదీశారు. ఈ ప్రశ్నలన్నింటికీ మోదీ సమాధానం చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. పార్లమెంటులో ఉపయోగించరాదంటూ కొన్ని పదాలను లోక్‌సభ సెక్రటరియేట్ ఓ పుస్తకాన్ని విడుదల చేసిన విషయాన్ని రాహుల్ ప్రస్తావించారు. కాగా, అన్‌పార్లమెంటరీ పదాల జాబితాను 1954 నుంచి ప్రకటించడం ఆనవాయితీగా వస్తోందని ప్రభుత్వం చెబుతోంది.'డాలరుతో రూపాయి విలువ రూ.80కి క్షీణించింది. గ్యాస్ సిలిండర్ ధర రూ.1000 దాటింది. జూన్ దేశంలో నిరుద్యోగుల సంఖ్య 1.3 కోట్లుగా నమోదైంది. ఇప్పుడు ఆహార ధాన్యాలపై జీఎస్‌టీ భారం పడింది. ప్రజా సమస్యలను లేవనెత్తకుండా మమ్మలను ఎవరూ ఆపలేరు. ప్రభుత్వం సమాధానం చెప్పి తీరాల్సిందే'నని రాహుల్ మంగళవారం ట్విట్టర్ వేదికగా డిమాండ్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.